## అంగన్వాడీల అక్రమ అరెస్టుకు నిరసనగా భారీ ర్యాలీ

**ఉలవపాడు, మార్చి 3, ప్రభాతవార్త**




మార్చి 2న విజయవాడలో చేపట్టిన అంగన్వాడీల ధర్నా శిబిరంలో తెల్లవారుజామున పోలీసులు అంగన్వాడీలను అరెస్టు చేసి తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్కు తరలించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉలవపాడు సిడిపిఓ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు .ఈ సందర్భంగా ఉలవపాడు ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అంగన్వాడీలకు జీతాలు పెంచమని అడిగితే ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు ఒక్కొక్కరికి లక్ష రూపాయల కూపన్లు ఇవ్వలేదా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద డబ్బులు ఉన్నాయి కానీ అంగన్వాడీలకు జీతాలు పెంచేందుకు డబ్బులు లేవా అని నిలదీశారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగించేలోపు అంగన్వాడీల వేతనాల పెంపుపై ప్రకటన చేయాలని లేని పక్షంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు, సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఉలవపాడు ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ ఇందిరావతి, వాకా లతారెడ్డి, కరేడు సెక్టార్ నుండి సి.హెచ్. పద్మజ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఇంటి పన్నుల వసూళ్లు పరిశీలించిన డిపిఓ వెంకటేశ్వరరావు

**కొత్తపట్నం మార్చ్ 3. ప్రభాతవార్త**



మండలంలో గ్రామ అభివృద్ధి అధికారులు వసూలు చేసే ఇంటి పన్నుల ను జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం హోలీ పండుగ సందర్భంగా సెలవు అయినప్పటికీ సిబ్బంది ఏ విధంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు అనే విషయాన్ని ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డిపిఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మడనూరు,కొత్తపట్నం, అల్లూరు గ్రామపంచాయతీ ల యందు ఇంటి పన్ను వసూలు పరిశీలించమన్నారు. మండలంలో మొత్తము ..2.24 కోట్లు ఇంటి పన్ను వసూలు కు గాను ..1.24 కోట్ల రూపాయలు వసూలు చేసి ఉన్నారని, మిగిలిన ..1.00 కోటి రూపాయలు కూడా మార్చి 15వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశములు జారీ చేసేమన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ ఎంపీడీవో గోపాల కృష్ణమూర్తి, జి ఎస్ డబ్ల్యు ఎస్ డిప్యూటీ ఎంపీడీవో నాగేశ్వర్ రావు పంచాయతీ అభివృద్ధి అధికారులు బాలాజీ విజయ గ్రామసచివాలయసిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎన్‌లో హోళీ వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



స్థానిక ముంగమూరు రోడ్లోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఘనంగా హోళీ వేడుకలు జరిగినట్లు కళాశాల డైరెక్టర్ కమ్ ప్రిన్సిపల్ వై. సత్యనారాయణ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి రంగు రంగుల పూలతో కళకళలాడే వసంత ఋతువు ప్రారంభానికి, చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా హోళీ పండుగ జరుపుకుంటారని, కుల మత బేధాలు మరచి పరస్పరం రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటూ జరుపుకునేరోజు అని, హోళీ పండుగ ఐక్యతకు, స్నేహ భావనకి ప్రతీక అని, మన దేశ సంస్కృతిలో హోళీ కి ప్రత్యేక స్థానం ఉంది అని,ఈ పండుగ ద్వారా పరస్పరం ప్రేమ సహనం, సఖ్యత పెంపొందించుకోవాలని సూచించారు.అనంతరం రంగుల పండుగ అయిన హోళీ వేడుకలను ఉత్సాహంగా మరియు ఆనందంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి పరస్పరం రంగులు చల్లుకుంటూ సంతోషంగా వేడుకలు జరుపుకున్నారు. కళాశాల ప్రాంగణం రంగుల కాంతులతో కళకళలాడింది. విద్యార్థులు సాంస్కృతిక, నృత్యాలు, పాటలతో అందరినీ అలరించారు ఈ కార్యక్రమం ప్రశాంతంగా సంతోషకరమైన వాతావరణం లో ముగిసింది. ఈ వేడుక ద్వారా విద్యార్థులలో ఐక్యత,స్నేహం మరియు సహకార భావం మరింత బలపడింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టీ. రాజేంద్ర బాబు, పీ. నీలిమ, బి.శ్యామల వైస్ ప్రిన్సిపల్ టి. రాజ శేఖరరెడ్డి అధ్యాపకులు శ్రీకాంత్, జోసెఫ్, పూర్ణచంద్రరావు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులు రక్తదానం ప్రాణదానంతో సమానం

- ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**




అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పి ఆర్.శ్రీనివాసరావు మరియు పోలీస్ అధికారులు ఒంగోలు పోలీస్ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళా దినోత్సవ వారోత్సవాల భాగంగా వారం రోజుల పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో అత్యవసర పరిస్థితుల్లో రక్తం కొరత లేకుండా ఉండేందుకు యువత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో, అలాగే మహిళలకు ప్రసవ సమయాల్లో రక్తం అత్యవసరంగా అవసరమవుతుందని, ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిజిహెచ్ బ్లడ్ బ్యాంక్‌కు రక్తాన్ని అందజేస్తున్నామని వివరించారు. పోలీస్ శాఖ పిలుపు మేరకు క్విజ్ కాలేజ్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రతి మహిళ తగినంత శ్రద్ధ వహించాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమ తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించడానికి యోగ, మెడిటేషన్ వంటివి చేయాలని సూచించారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు తాలూకా సిఐ టి.విజయ్ కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ యు.సుధాకర్, డాక్టర్ అశ్విని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మానవతా సేవా సంస్థ సేవలు విస్తరించాలి..

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



మానవత సేవా సంస్థ ఒంగోలు శాఖ విస్తృత సమావేశం ఒంగోలు అంజయ్య రోడ్డులో గల ఆ రామ క్షేత్రం నందు జరిగిన సమావేశం కు మానవత సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు అధ్యక్షత వహించారు, ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ దుఃఖం లో ఉన్నవారిని ఓదార్చిమన చేయూత ద్వారా ఒక భరోసా కల్పించడమే మానవత లక్ష్యమని తెలిపారు.మానవతా సేవ సంస్థ కార్యక్రమాలు విస్తరించి సభ్యత్వం ఎక్కువ మందిలో చేర్పించి సేవా కార్యక్రమాలు చేయాలని మరణించిన వారికి ఉచిత మార్చురీ బాక్సులు అంతిమ వాహనం ఏర్పాటు చేయాలని మరణించిన పేదలకు మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించి వారికి సహాయపడాలని తెలిపారు. ఈ సమావేశంలో మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు శరభలింగాచారి జిల్లా ప్రతినిధి టమటం రామిరెడ్డి. కార్యదర్శి డి.చంద్ర శేఖర్, కోశాధికారి ఎం,భోజరెడ్డి, వడ్డేంపూడి సుజాత రావు. కోసూరి శ్రీదేవి మోటుపల్లి వెంకటేశ్వర్లు (చౌదరి) వెంకట్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, తన్నీరు సురేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు నిరసనగా అంగనవాడి కార్యకర్తలు ధర్నా

**కొండపి, ప్రభాతవార్త**



తమ న్యాయమైన కోరికల సాధనకు చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లిన అంగనవాడి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసుల తీరును నిరసిస్తూ అంగనవాడి కార్యకర్తలు ఐసిడిఎస్ కొండపి ప్రాజెక్టు కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అంగనవాడి కార్యకర్తల న్యాయమైన వేతనంకై విజయవాడలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి హాజరైన అంగన్వాడీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేశారని వారు ఆరోపించారు. .కనీస వేతనం లేక అంగన్వాడీకార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని కనీస వేతనం 26000 ఇవ్వాలని కోరుతూ గత ప్రభుత్వంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా తమ నిరసనకు మద్దతు పలికిన టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం తమకు న్యాయం చేస్తుందన్న ఆశతో ఉన్నామని వారు ఆరోపించారు, అక్రమ అరెస్టులను వెనక్కి తీసుకొని తమ న్యాయబద్ధమైన వేతనాన్ని అందించి ఆదుకోవాలని వారు కోరారు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ముందు నినాదాలు చేశారు, అనంతరం మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు పరిధిలోని పలు మండలాల నుండి అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

# ప్రకాశం వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

## ప్రజాకవి పిన్నికకు ఘన నివాళులు

**చీమకుర్తి, మార్చి 3, ప్రభాతవార్త**



ప్రజా కవి పిన్నిక శ్రీనివాస్ మరణం సమాజానికి తీరని లోటుగా రాష్ట్ర యాదవ సంఘం అధ్యక్షులు బొట్ల రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. చీమకుర్తి లోని పిన్నిక శ్రీనివాస్ నివాసంలో ఏర్పాటు చేసిన పిన్నిక శ్రీనివాస్ చిత్రపటానికి మంగళవారం ఘనమైన నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబం సభ్యులు లను అఖిలభారత యాదవ సంఘం నాయకులు పరామర్శించారు.కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బొట్లా రామారావు యాదవ్, జిల్లా అధ్యక్షులు బొట్లా సుబ్బారావు యాదవ్, పెద్దన్న, ఏ.ఆర్.కృష్ణ, చీమకుర్తి మున్సిపాలిటీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, సర్పంచ్ వెంకట్రావు, ఫణిదపు సుధాకర్,బత్తుల మల్లికార్జున, తెల్లమేకల గాంధీ, సోమా శేషాద్రి,ఖాదర్ బాషా,పేరం శ్రీనివాస్,దళిత సేవా ఫౌండేషన్ యలమందబాబు, దావీదు పాల్గొన్నారు.

# నేతల దందా అడ్డుకునేదుండా..?

- గ్రావెల్ మాఫియా గుప్పిట అసైన్డ్‌మెంట్ భూములు
- గుట్టపై కన్నేసి గుట్టుగా తవ్వేస్తున్నారు

**ఒంగోలు, ప్రభాతవార్త**

మన ఊరు మన భూమి కొండ, గుట్ట వాగు, వంక, ఊరవెంబడి ఆస్తి అన్న ఇంకితం కొందరిలో లోపిస్తుంది. అధికారుల అండతో స్వార్ధ పరులు యధేచ్ఛగా ప్రకృతి వనరుల విధ్వంసం కొనసాగిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. వీరి చర్యలతో గతంలో ఇక్కడ గుంట, కొండ, వాగు, వంకలు ఉండేదని చెప్పుకునే పరిస్థితి. ఈ ప్రాంతాల్లో తవ్విన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమ తరలింపును అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థిరాస్థి వ్యాపారులు వారి ప్లాట్ల ఎత్తు పెంచుకునేందుకు మట్టి నిల్వల కోసం సమీపంలోని గుట్టలు, కొండలపై వాలిపోతున్నారు. యంత్రాలతో మట్టితవ్వి తరలిస్తున్నారు. పేదలు, ప్రభుత్వ భూమిలే లక్ష్యంగా మట్టి మాఫియా దందా కొనసాగుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రైవేటు లేఅవుట్లు పదుల సంఖ్యలో వెలుస్తున్నాయి. వీటికి తోడు బెంగుళూరు- విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం నిర్మాణ పనుల కోసం మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. వీటన్నింటికి గ్రావెల్ అవసరం. ఇది అక్రమాలకు వరమైంది. కొందరు పేదలను మభ్యపెట్టి తక్కువ ధరకు అసైన్డ్‌మెంట్ భూమిని కొనుగోలు చేశారు. వాటిలో గ్రావెల్ తవ్వి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఒంగోలు నియోజకవర్గపరిధిలోని యరజర్ల, సర్వేరెడ్డిపాలెం, కొణిజేడు కొండల నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారు. ఆ మట్టిని ఒంగోలులోని పెద్దపెద్ద వెంచర్లకు తరలిస్తున్నారు. పెళ్లూరు చెరువులో మట్టిని కొందరు అక్రమంగా తరలిస్తుంటే ఇటీవల విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. వారికి ఇరిగేషన్, జలవనరుల శాఖ అధికారే పక్కన పట్టాభూమిలో కొన్ని వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు ఇచ్చారు. ఈ పట్టాభూమిని ఆసరాగా చేసుకుని చెరువులో మట్టిని కూడా తోలుకుంటున్నారు. సంతనూతలపాడు, దర్శి, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, అద్దంకి, కందుకూరు నియోజకవర్గాల్లోని మట్టి మాఫియా విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. అసైన్డ్‌మెంట్ భూములు గ్రావెల్ మాఫియా గుప్పిట్లో ఉన్నట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉన్న నేతలే దందా కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పెద్దల నుంచి అభయం ఉండడంతో అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ఎవ్వరు సాహసించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎకరా భూమిని నాలుగు లక్షలకు కొనుగోలు చేసి అందులో కోట్ల విలువ చేసే గ్రావెల్‌ను కొల్లకొడుతున్నారు. ప్రైవేటు వెంచర్ల నిర్వాహకులకు విక్రయించి జేబులు నింపుకుంటున్నారు. ఇది నిరాటకంగా సాగుతున్నా ఎక్కడా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అక్రమార్కుల చర్యలతో తాగునీటి చెరువులు రూపు కోల్పోతున్నాయి. ప్రభుత్వ భూముల్లోనూ యధేచ్ఛగా తవ్వకాలు సాగిస్తూ దర్జాగా రవాణా సాగిస్తున్నారు. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు ఇటుగా చూడకపోవడంతో వారు మరింత బరితెగిస్తున్నారు. గత ఏడాది ఆగష్టు నుంచి నవంబర్ వరకు కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు పెద్ద చెరువు, చెమిడిదిపాడు చెరువుల నుంచి కొందరు స్థిరాస్థి వ్యాపారులు వేలాది ట్రక్కులు గ్రావెల్‌ను అడ్డగోలుగా తరలించారు. ప్రస్తుతం అక్కడ నీరు చేరడంతో వేరే ప్రాంతాల నుంచి జేసీబీల ద్వారా ఇష్టారీతిన మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. నిండా నీరున్నా ఒక వైపు కట్టను తొలగించి మరి వాహనాల రాకపోకలకు ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రభుత్వ పనులకు తాత్కాలిక పర్మిట్లు తీసుకుని రహదారి నిర్మాణం చేపడుతున్నారు. ప్రైవేటు వ్యక్తులకు ఎవరికి అనుమతులు ఇవ్వడం లేదని, గ్రావెల్ తరలింపుపై తనిఖీ కేంద్రాల్లో చేస్తున్న వసూళ్ళ, అనధికారికంగా జరుగుతున్నాయని పరిశీలించి చర్యలు తీసుకుంటామని మైనింగ్ అధికారులు అంటున్నారు.



# పేదలు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు
- ఒంగోలు నగర అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం పాల్గొన్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో పేదల గృహ నిర్మాణాలకు నిర్దేశించిన లేఅవుట్స్‌లో అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత తొందరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన రావులతో కలసి మున్సిపల్, రెవెన్యు అధికారులతో సమావేశమై ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలన్న లక్ష్యంతో ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో అగ్రహారం, యరజర్ల వద్ద లే అవుట్స్‌ను వేయడం జరిగిందని, ఈ రెండు లే అవుట్స్ లో అర్హులైన లబ్ధిదారులకు వీలైనంత తొందరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒంగోలు నగరంలో నిరుపయోగంగా ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పిపిపి పద్దతిలో నగర కార్పోరేషన్ కు ఆదాయం వచ్చేలా షాప్స్, మాల్స్ నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, ఒంగోలు తహసిల్దార్ మధుసూదన్ రావు, రిజిస్ట్రేషన్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

## యువతిని ప్రాణాపాయం నుండి కాపాడిన కిమ్స్ వైద్యులు

**ఒంగోలు, ప్రభాతవార్త**




కందుకూరుకు చెందిన 21 ఏళ్ళ యువతీ కుటుంబ కారణాలు వల్ల 1/2 లీటర్ హార్పిక్ త్రాగి తీవ్రమైన కడుపు నొప్పితో కందుకూరులోని ప్రైవేట్ హాస్పిటల్ వెళ్లారు. అక్కడ డాక్టర్స్ ప్రధమ చికిత్స చేసి చేసి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ కు తరలించారు. అన్ని రకముల వైద్య పరీక్షలు నిర్వహించిన తరువాత లోపల ప్రేగు పగిలిందని వైద్యులు నిర్ధారించారు.సుమారు ఒక లీటర్ వరకు కడుపులో చీము మరియు పసర ఉందని నిర్ధారించిన డా. పెరుమాళ్ళ కార్తీక్ బాబు ( గ్యాస్ట్రో సర్జన్ ), డా రామకృష్ణ (అనస్థీషియా) బృందం పేషెంట్ కు ఎమర్జెన్సీ ఆపరేషన్ నిర్వహించారు." ఈ హార్పిక్ వల్ల జీర్ణకోస మొత్తం కుళ్ళిపోయి ప్రేగు పగిలి సుమారు 1లీటర్ చీము మరియు పసర కడుపులో పేరుకుపోయిందని ఇందుకు గాను జీర్ణకోశం మొత్తం తొలగించ వలసి వచ్చిందని డా కార్తీక్ బాబు పెరుమాళ్ళ వెల్లడించారు.హార్పిక్



త్రాగడం వల్ల ప్రేగులో అలసర్స్ రావడం, తరుచుగా జరుగుతుందని కానీ ఇలా జీర్ణకోశ మొత్తం పగిలిపోవడం చాలా అరుదుగా జరుగుతుందని డాక్టర్ గారు చెప్పారు.ఈ సందర్భంగా మెడికల్ డైరెక్టర్ డా తూము శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ చేసిన బృందన్ని మరియు ఐసీయూ బృందన్ని అభినందిస్తూ ఇటు వంటి క్లిష్ట పరిస్థితి మరియు ఆరుదైనా శస్త్ర చికిత్సచేసి రోగిని కాపాడినందుకు అయన వైద్య బృందనికి అభినందనలు తెలియచేసారు మరియు చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అంకిరెడ్డి మాట్లాడుతూ ముందుగా డా కార్తీక్‌బాబు, పెరుమాళ్ళ వైద్య బృందన్ని అభినందిస్తూ ఇలాంటి వైద్య సేవలు అందించడం లో మా వైద్య బృందం ఎల్లప్పుడూ అత్యానుదికమైన వైద్య సేవలతో ఎప్పుడు ముందు ఉంటుందని తెలిపారు.

# అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలంటూ మానవహారం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



అంగన్వాడి కనీసవేతనం26,000 ఇవ్వాలని విజయవాడలో మహాధర్నాలో పాల్గొన్న, అంగన్వాడి రాష్ట్ర నాయకత్వం అక్రమ అరెస్టులను ఖండిస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద చర్చి సెంటర్లో మానవహారం నిర్వహించడం జరిగింది. స్థానిక ఏ.పీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్ ఒంగోలు ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద చర్చి సెంటర్లో మానహారం నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఒంగోలు ప్రాజెక్ట్ కార్యదర్శి కె.ఏమీమా అధ్యక్ష వహించారు. యూనియన్ జిల్లా సెక్రెటరీ ఈదర అన్నపూర్ణ మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు సమాజంలో పేద గర్భిణీ బాలింతలు చిన్నపిల్లలకు సేవలందిస్తున్న అంగన్వాడీలను నిర్లక్ష్యంగా చేస్తున్నాయి, ఐసిడిఎస్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన నేటికీ అంగన్వాడీ కార్మికులకు గుర్తించులేదు. కనీస వేతనాలు, పిఎఫ్, ఈ ఎస్ఐ, పెన్షన్,సౌకర్యాలు అమలుచేయడం లేదు. 2019 నుండి పెరుగుతున్న ధరలు అనుగుణంగావేతనాలు పెంచలేదు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లు ఐసిడిఎస్ వేతనాలు పెంచాలని. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాజెక్టు కేంద్రాల వద్ద గత నెల 22వ తేదీ నుండి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోలునగర కన్వీనర్ టిమహేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు మాసాలవుతున్న నేటికీ సమ్మె డిమాండ్ కానీ సమ్మె డిమాండ్ కానీ అంగన్వాడి కనీస వేతనాలు అమలు చేయడం కానీ సమస్యల పరిష్కారం చేస్తావని కానీ స్పష్టమైన హామీ నేటి కూడా ప్రకటించలేదు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్ మజుందార్, జి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో మూడు లక్షల కోట్ల రూపాయలు ప్రవేశపెట్టింది. కనీసం అంగన్వాడి వర్కర్స్ వేత్తనాలను పెంచే విషయంలో కానీ ఐసిడిఎస్‌ని అభివృద్ధి నిధులు కానీ ప్రస్తావం లేదు. అంగన్వాడి వర్కర్స్ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే స్వామి రెడ్డి, తిరుపతిరెడ్డి,మల్లారెడ్డి అంగన్వాడి యూనియన్ నాయకులు కే వి సుబ్బమ్మ, ఏ పద్మ, పి నిర్మలదేవి, శేషమ్మ,సంధ్య మాధవి,శోభ, అరుణ పాల్గొన్నారు.

## ఒలంపియాడ్ స్కూల్ నందు మెరిపించిన సైన్స్ దినోత్సవం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




స్థానిక లాయర్ పేట లోని నారాయణ సిఓ అండ్ ఒలంపియాడ్ స్కూల్ నందు సైన్స్ దినోత్సవాన్ని ముఖ్య అతిథి విచ్చేసిన డాక్టర్ బాలాజీ నాయక్, పాఠశాల క్లస్టర్ ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్ వలి జ్యోతి ప్రజ్వలన చేసి సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరము ఒంగోలు నుండి జాతీయస్థాయి జెఇఇ మెయిన్స్ అండ్ అడ్వాన్స్, నీట్ సెలక్షన్స్ సాధించటానికి, సాధించే విధంగా స్కూలు స్థాయిలో సిఓ ఒలంపియాడ్ మెడికల్ ప్రోగ్రామ్స్ బాగా దోహదపడుతున్నాయని తెలియజేశారు. 2024ఆల్ ఇండియా స్థాయిలో జెఇఇ మెయిన్స్ షేక్.సూరజ్ 300/300, 2025 సంవత్సరంలో ఆల్ ఇండియా స్థాయిలో మధు కిరణ్ రెడ్డి అడ్వాన్స్ 11వ ర్యాంక్, నీట్ ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరి 43వ ర్యాంకు సాధించిన అమిత్ మరియు 2026 జెఇఇ మెయిన సెషన్ 1 నందు 99.88 సాధించిన బి.సాయి లిఖిత వీరందరూ ఈ స్కూల్ విద్యార్థులు కావడం విశేషమని తెలియచేశారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులు తయారు చేసినటువంటి వివిధ రకాల ప్రయోగాలను తిలకించి ఆ ప్రయోగాల విశేషాలను విద్యార్థుల ద్వారా తెలుసుకొని విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, విశ్లేషణను చూసి అభినందించారు. ఈ సైన్స్ దినోత్సవాన్ని ఇంత ఘనంగా నిర్వహించడంలో ప్రిన్సిపల్ సయ్యద్ నాగూర్‌వలి ప్రాధాన్యత, ప్రోత్సాహం సుస్పష్టంగా కనిపిస్తుందని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు విద్యార్థుల్లో దాగి ఉన్న సైన్స్ పరమైన అంశాలు మాత్రమే కాకుండా భాషాపరమైన సాంస్కృతికపరమైన వివిధ రకాల వేషధారణలను కూడా ప్రోత్సహించటంలో ముందుంటుందని చదువుతోపాటు విలువలను కూడా అందించడం నారాయణ విద్యాసంస్థల యొక్క మొదటి ప్రాధాన్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజిఎం నర్రావుల పెద్దిరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

## విద్యుత్ ఘాతంతో గేదె మృతి

**జె.పంగులూరు మార్చి 3 ప్రభాతవార్త**

విద్యుత్ ఘాతంతో చూడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని ముప్పవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి వెంబడి కోటేలు డొంక సమీపంలో బీడు భూమిలో ఉన్నవిద్యుత్ తీగలు ఒక లైన్లో విద్యుత్ కలెక్షన్‌లో ఉన్న లైను, మరో వరుసలో 11కెవి లైనులు సమాంతరంగా ఉన్నాయి. మంగళవారం గేదెల మేపుకుంటున్న చెన్నుపాటి పూర్ణచంద్రరావు తన గేదెలను మేత కోసం బీడు భూమి లో మేపుతున్నాడు. తక్కువ ఎత్తులో ఉన్న తీగలు గేదెకు తగలడంతో సమాంతరంగా ఉన్న 11 కె.వి తీగలకు ఈ తీగలు తగిలాయి. దీంతో విద్యుత్తు ప్రసరించి గేదెకు విద్యుత్ ఘాతం మై గేద అక్కడికక్కడే మరణించింది. పశు పోషకుడు పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తంచేశారు. చనిపోయిన గేదె 9 నెలల సూడి అని 1,50,000 విలువచేసే ఈ గేదే మరణించడం తన కుటుంబానికి చాలా నష్టమని విలపించాడు.



## పంగులూరు ఉపకేంద్రంలో 100 కె.వి. ఏ ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు

**జె. పంగులూరు మార్చి 3 ప్రభాతవార్త**

మండలంలోని పంగులూరు విద్యుత్తు ఉపకేంద్రం లో 100 కె.వి.ఏ ట్రాన్స్ ఫార్మర్స్ కొత్త లైన్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏఈ. ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏఈ ఆంజనేయులు మాట్లాడుతూ పంగులూరు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో గల పంగులూరు, చందలూరు, ఆరికట్ల వారి పాలెం గ్రామాలలో బుధవారం 100 కె.వి.ఏ ట్రాన్స్ ఫార్మర్స్ కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1.గంటల వరకు విద్యుత్ అంతరాయంకి నిలిపివేయబడుతుందని ఏఈ ఆంజనేయులు తెలిపారు. ఈ గ్రామాల్లోని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు ప్రశంసా పత్రం




**బల్లికురవ, మార్చి 3, ప్రభాతవార్త**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలోని వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ ప్రాంత వాసుల భద్రత కోసం మంగళవారం హనుమాన్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కే.రమేష్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలకుగాను ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా అటవీ సమీప గ్రామాలలో మనుషులు, వన్య ప్రాణుల ఘర్షణలను నివారించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వన్యప్రాణులను రక్షించేందుకు ప్రత్యేక యాప్ రూపకల్పన చేశారు. దీని ద్వారా జంతువుల కదలికలపై పరిసర గ్రామాల ప్రజలను ముందస్తు హెచ్చరికలతో భద్రత చర్యలను చేపడతారు. అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖల సంయుక్త సహకారంతో హనుమాన్ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేసేందుకు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశేష సేవలు అందించిన అధికారులకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావడం హర్షనీయం.

# ఘనంగా హోలీ పర్వదిన వేడుకలు



**బల్లికురవ, మార్చి 3, ప్రభాతవార్త**

చెడుపై మంచి సాధించిన విజయానికి వసంత రుతువు ఆగమనానికి ప్రతీకగా జరుపుకునే వేడుక హోలీ పర్వదినం. పండుగలకు పుట్టినిల్లు పవిత్ర భారతదేశం. వీటిలో రంగుల పండుగ హోలీకి ప్రత్యేక స్థానం ఉంది. మంగళవారం మండలంలో ఈ వేడుకలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. ఉత్తరాది నుండి వలస వచ్చిన కార్మికుల కోసం గ్రానైట్ ఫ్యాక్టరీలలో సెలవు దినాన్ని ప్రకటించారు. మధురలోని శ్రీకృష్ణుని దేవాలయాల నుండి, కర్ణాటకలోని హంపి వరకు ఒక్కొక్క ప్రాంతంలో ఒక రకమైన ప్రత్యేక సంప్రదాయం ఉంటుంది. రంగురంగుల గులాములతో పాటలు, ఆటలు, నోరూరించే మిఠాయిలు నడుమ ఉత్తరాది సంప్రదాయాన్ని, అడుగడుగునా తలపింపచేస్తూ వలస కార్మికులు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం, ఆధ్యాత్మికత, ఆధునిక హంగుల మేళవింపుతో ఈ పర్వదిన వేడుకలు కొనసాగాయి. రొటీన్‌కు భిన్నంగా ప్రత్యేకమైన హోలీ వస్త్రధారణలతో ఈ పర్వదినానికి నూతన శోభ సమకూరింది. ప్రేమానురాగాలు, సామాజిక ఐక్యతను ఈ పర్వదినం మరింతగా పెంపొందిస్తుంది. హోళికా దహనం ద్వారా చెడుపై మంచి సాధించిన విజయాన్ని గుర్తు చేసుకుంటూ, యువతీ యువకులు కొత్త ఆశలకు ప్రతీకగా హోలీ పర్వదినాన్ని జరుపుకున్నారు.

## చిరుత పులిని జనవాసాల నుంచి సురక్షితంగా అడవి మార్గం వైపు మళ్లించాం

### - రేంజ్ అధికారిణి ప్రసన్న జ్యోతి





**యర్రగొండపాలెం, మార్చి 3, ప్రభాతవార్త**

గడ్డమీద పల్లె గ్రామ శివారు ప్రాంతంలోని రైతులు తమ పొలాలలో తవ్వుకున్న అక్కడి నీటి గుంత ఆ చిరుత పులికి అడ్డగా మారిందని, ఆ చిరుత పులి ఈ నీటి గుంత దగ్గర విశ్రాంతి తీసుకోవడానికి అలవాటు పడిందని, దాంతో పాటు పులులు ఒంటరి వేటగాళ్ళుగా ప్రసిద్ధి అని, అవి తరచుగా నీటి గుంతల కేంద్రంగా చేసుకొని తిరుగుతుంటాయని, ఈ ప్రాంతాలకు నీళ్ళు తాగడానికి వచ్చే జంతువులను వేటాడటం సులభం అవుతుంది. గనుక నీటి గుంతలను కేంద్రంగా చేసుకొని తిరుగుతుంటాయని అధికారులు చెబుతున్న మాట, అయితే జనవాసాల సమీపంలోకి వచ్చిన చిరుతపులిని అటవీ అధికారులు సురక్షితంగా అడవి మార్గం వైపు మళ్లించారని, ఈ ప్రక్రియలో చిరుత పాదముద్రలు గుర్తించి, దాని కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అడవి అంచున ఉన్న గ్రామస్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకొని 24గంటలు అక్కడే సిబ్బంది పని చేస్తున్నారని, 13 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసి చిరుత పులి సురక్షితంగా అడవిలోకి వెళ్లేలా నిఘా ఉంచారని అక్కడి రేంజ్ అధికారిణి ప్రసన్న జ్యోతి ఇటీవలే ఓ సందర్భంలో ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. చిరుత గందరగోళంతో జనం పొలాల్లోకి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. పొలాల్లో ఆకు కదలిన చెట్టు ఊగిన అదిగో పులి, ఇదిగో చిరుత అంటూ పులి భయంతో ఒకటే టెన్షన్ పడుతున్నారు. చిరుత అడవి వైపు మళ్ళీందనే విషయం అధికారులు చెబుతున్నప్పటికి గ్రామంలో ప్రజలకు నమ్మిక కుదరడం లేదని భయాందోళనలకు స్వస్తి పలక లేకపోతున్నట్లు తెలుస్తోంది. గ్రామంలోని కొందరైతే ఆ క్రూర జంతువు ఏమన్న మనిషా, ఇది జనవాసం ఇక్కడ నువ్వు ఉండకూడదు, నువ్వుంటే నీ ప్రాంతం అడవి వెళ్ళిపో అంటే వెళ్ళిపోవడానికి, అంటూ మాట్లాడుతుండటం గమనార్హం.

# వరిగడ్డి వామి దగ్ధం - రూ.40 వేలు నష్టం



**నాగులుప్పలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**

వరిగడ్డి వామి దగ్ధమై రూ.40 వేలు నష్టం వాటిల్లిన సంఘటన మంగళవారం ఉప్పుగుండూరులో జరిగింది. వివరాల మేరకు గోగినేని ఆంజనేయులుకు చెందిన వరిగడ్డి వామి ఉప్పుగుండూరు బైపాస్ రోడ్డులోని మాచవరం రోడ్డు వద్ద ఉన్న వరిగడ్డి వామి ప్రమాదవు శాత్తు నిప్పు అంటుకొని ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. దాంతో స్థానికులు అగ్నిమాపక దళంకు సమాచారం అందించారు. అగ్నిమాపక దళం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసినప్పటికి పూర్తిగా కాలిపోయింది. దాంతో రూ.40వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

# భూమి హక్కు రైతుల భవిష్యత్తుకు పునాది

### - మీ భూమి - మీ హక్కు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు, మార్చి 3, ప్రభాతవార్త**

భూమి హక్కు రైతుల భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని,ప్రజల ఆస్తిహక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు మండలంలోని పొదలకుంటపల్లి గ్రామంలో మంగళవారం మీ భూమి–మీ హక్కు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తన భూమిపై పూర్తి హక్కుతో సాగు చేసుకునేలా చట్టబద్ధమైన పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. మన ప్రాంతంలో సుమారు 70% మంది వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా 56 నియోజకవర్గాలకు నీరు అందించవచ్చని, హార్టికల్చర్ పంటల ద్వారా రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. త్వరలో వెలుగొండ ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు పూర్తి స్థాయిలో నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బమ్మ,రాజగోపాల్, గొంటు బ్రాహ్మణంద ఒడ్డి, చేరెడ్డి జయరాంరెడ్డి, రామిరెడ్డి, పందనబోయిన రవి, గంటు పుల్లారెడ్డి, మాజీ సర్పంచులు శీలం శివారెడ్డి, బోదనబోయిన గోపాల్, కడియం శేషగిరి, దప్పిలి శ్రీనివాస్ రెడ్డి, గూడపురెడ్డి రాఘరమ రెడ్డి, స్థానిక నాయకులు, మండల రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం



**పొన్నలూరు,మార్చి 3, ప్రభాతవార్త**

సిఎస్ఆర్ ఇన్ఫ్రా వెంచర్ పొన్నలూరు వారి సిఎస్ఆర్‌చారిటబుల్‌ట్రస్ట్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. పొన్నలూరులోని సిఎస్ఆర్ ఇన్ఫ్రా వెంచర్ ప్రాజెక్టు వద్ద మంగళవారం నిర్వహించిన షిప్ట్ టీం అండ్ పాస్టర్స్ ఫెలోషిప్ స్తుతి విజ్ఞాపన ప్రార్ధన కూడిక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సి ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని, వారి సేవలు పేదవారికి అండగా నిలవాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ సిహెచ్. రాజు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల వారికి అండగా సహాయ సహకారాలు అందించేందుకు ఈ ట్రస్టును ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, విద్యార్థులకు పేదవారికి ఎల్లప్పుడూ అండగా ఉండేందుకే ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఈ ట్రస్టు సేవలు ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అదేవిధంగా సిఎస్ఆర్ కంపెనీ ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగం సామాజిక సేవా కార్యక్రమాలకు నిర్వహించాలని దృఢ సంకల్పంతో ట్రస్టును స్థాపించామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పాస్టర్ పాల్,బోండా నవీన్ ప్రకాష్,ఎస్ఎల్ఎన్ మార్కెటింగ్ ఎండి, కావలి పాస్టర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆకుల ఏసుబాబు,షిప్ట్ డైరెక్టర్ పాలేటి థామస్,పాస్టర్ కోటేశ్వరరావు, కావలి దైవ సేవకురాలు ధన్యదత్,తదితరులు పాల్గొన్నారు.

# ఆర్.ఎం.పీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

### - డా. కొండిశెట్టి సురేష్‌బాబు



**మార్కాపురం, మార్చి 3,ప్రభాతవార్త**

గ్రామీణ వైద్యుల (ఆర్.ఎం.పీ) సమస్యలకు ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కొండిశెట్టి సురేష్ బాబు తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూటమి నాయకులు గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ అంశంపై రాష్ట్ర క్యాబినెట్‌లో కూడా చర్చ జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వ స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్న ఆర్.ఎం.పీల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామీణ వైద్యులతో చర్చలు జరిపి, వారి ఉపాధి భద్రత, గుర్తింపు, శిక్షణ, సంక్షేమ అంశాలపై స్పష్టమైన విధాన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల ఉచిత సేవలు ప్రశంసనీయం

### - ఎవరికో చూపును ప్రసాదించిన శంకర నేత్రాలయ సేవలు మరువలేనివి

### - అభినందనలు వెల్లువ





**పెద్దదోర్నాల, మార్చి 3, ప్రభాతవార్త**

ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తూ వేలాది మందికి చూపు ప్రసాదిస్తున్న శంకర నేత్రాలయ వైద్యశాల సేవలు ప్రశంసనీయమని అధికారులు, ప్రజా ప్రతినిధులు కొనియాడారు. మార్కాపురం జిల్లా మండల కేంద్రమైన పెద్దదోర్నాల శివసదనంలో మంగళవారం శంకర నేత్రాలయ వైద్యశాల ఆధ్వర్యంలో గాయం వెలుగొండ రెడ్డి పర్యవేక్షణలో ఉచిత కంటి పొర వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలకు నాణ్యమైన కంటి వైద్యం అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. మొబైల్ సంచార వాహనంలో శస్త్ర చికిత్సలు చేసి ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా ఎందరికో కంటి చూపు ప్రసాదిస్తూ అంధత్వాన్ని తగ్గించే దిశగా విశేష కృషి చేస్తుందన్నారు. మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఆధునిక సాంకేతిక పరికరాలు కలిగి మంచి సేవలు అందిస్తున్న శంకర నేత్రాలయ కంటి వైద్యశాల సేవలు అభినందనీయమని, అంత మాత్రమే కాకుండా మొబైల్ వాహనంలో గ్రామీణ ప్రజల వద్దకే వచ్చి పొర వైద్య చికిత్సలు చేయడం శుభ పరిణామం అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా అనేక కుటుంబాలకు వెలుగు నింపుతున్నారని అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు కొనసాగించాలని కోరారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా భాగా వెనుకబడి చెంచు, సుగాలీ గిరిజనులు నివసించే ఇటువంటి ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరాలు జరగడం అభినందనీయమని, ఈ సేవ మహోన్నతమైందని శంకర నేత్రాలయ వైద్యశాల సేవలు పేద ప్రజలకు వరమని అన్నారు. సాయి సాయి సేవా సంస్థల జిల్లా ప్రతినిధి తంగిరాల రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు వరము లాంటివని అభిప్రాయపడ్డారు. కంటి ఆరోగ్యంపై అవగాహన పెంచుతూ సమాజానికి వెలుగునిస్తున్న శంకర నేత్రాలయ సేవలు మరింత విస్తరించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఆయన కోరారు. ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో టీడీపీ మండల కన్వీనర్ షేక్ మాబు, మాజీ కన్వీనర్ ఏరువా మల్లిఖార్జునరెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, రావికింది సుబ్బరత్నం, జడి లక్ష్మయ్య, జనసేన మండల కన్వీనర్ కేతి వెంకట మోహన మురళి, పలువురు నాయకులు, శంకర నేత్రాలయ కంటి వైద్యశాల బృందం, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం మొబైల్ వాహనాలలో కంటి శస్త్ర చికిత్స ఆపరేషన్లు చేపట్టారు.

# అంగన్‌వాడీల అక్రమ అరెస్టులను ఖండించండి

### - రూ.26వేలు వేతనం పెంచండి

### - దోర్నాల నటరాజ్ సెంటర్లో మానవహారంతో నిరసన





**పెద్దదోర్నాల, మార్చి 3, ప్రభాతవార్త**

విజయవాడలో అంగన్‌వాడీ కార్యకర్తలపై జరిగిన అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటీయు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం మండల కేంద్రమైన పెద్దదోర్నాలలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం నటరాజ్ సెంటర్లో రాస్తారోకో చేశారు. మానవహారం నిర్మించి తమ నిరసన ఆందోళనను వ్యక్తం చేశారు. తమకు 26 వేలు రూపాయలు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు జి.మల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల జీతాలు పెంచమంటే రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని, అరెస్టు చేసిన అంగన్‌వాడీ నాయకులను, కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని, అంగన్‌వాడీల న్యాయమైన కోరికలలో భాగంగా వేతనాల పెంపుపై ప్రభుత్వం తక్షణమే స్పష్టమైన ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను నిర్బందించడం అత్యంత పాశవిక చర్య అని, మహిళా సాధికారిక అని చెప్పుకునే కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలను పోలీసు స్టేషన్లో నిర్బందించడం సాధికారిక ఎలా అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరలు, పెరుగుతున్న ఖర్చులు, ఇంటి అద్దెలు, కరెంటు ఛార్జీలు, పిల్లల స్కూల్ ఫీజులు, నిత్యవసర వస్తువుల ధరల పెంపుదల దృష్ట్యా గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఎలాంటి జీతాలు పెంచకుండా వెట్టిచాకిరి చేస్తున్న అంగన్‌వాడీలకు తక్షణమే జీతాలు పెంచాలని ప్రకటన చేయాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. అక్కడి నుండి ప్రదర్శనతో స్థానిక శివసదనం వద్ద వైద్య శిబిరం ప్రారంభించి వెళ్తున్న జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ప్రయాణిస్తున్న కారును నిలిపే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు అనుమతి ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇదేమి న్యాయమంటూ నిరాశ, నిస్పృహ నిటూర్పులతో వెను తిరిగిపోయారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు షేక్ ముంతాజ్ బేగం, వెంకటరత్నం, వెంకటలక్ష్మి, శ్రీలత, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దావీదు, ఏసేబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆపదలో ఆసరాగా ప్రభుత్వం

### - అత్యవసర వైద్యానికి ఎమ్మెల్యే ఏలూరి వెన్నుదన్ను

### - 3 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం



**మార్టూరు, మార్చి 3, ప్రభాతవార్త**

ప్రాణాపాయ స్థితిలో చికిత్స కోసం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయం తలుపుతట్టిన మూడు కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు. బాధితుల ఆవేదనను వ్యక్తిగతంగా స్వీకరించి ప్రభుత్వంతో సమన్వయం చేసి ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) ద్వారా ఎల్‌ఓసీ మంజూరు అయ్యేలా తక్షణ చర్యలు చేపట్టారు. క్యాన్సర్, గెండె, సంబంధిత, బేబీ అత్యవసర వైద్య అవసరాల కోసం మొత్తం రూ.9.89 లక్షల ఆర్థిక సహాయం అందడంతో చికిత్సకు మార్గం సుగమమై, ఆందోళనలో ఉన్న కుటుంబాలకు ఒక భరోసాగా దైర్యం కల్పించారు. ఎమ్మెల్యే ఏలూరి ప్రజల ఆపదను తన బాధ్యతగా భావించిన ప్రజా ప్రతినిధి స్పందన, ప్రభుత్వం- ప్రజా ప్రతినిధి సమన్వయం కలిసి ప్రాణాలకు మూడు కుటుంబాలకు ఎమ్మెల్యే సాంబన్న ఆసరాగా, వెన్నుదన్నుగా నిలిచారు. మార్టూరు, కారంచేడు మండలాల్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు బాధితులకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.9,89,847ల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. కారంచేడు మండలం కారంచేడు గ్రామానికి చెందిన పోతిని విజయలక్ష్మి క్యాన్సర్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ అత్యవసర చికిత్స అవసరమైన పరిస్థితి ఏర్పడింది. స్పందించిన ఎమ్మెల్యే రూ.6లక్షల చెక్కును మంజూరు చేయించారు. మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన సోమల ఆంజనేయులు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఎమ్మెల్యే సిఫార్సుతో రూ.2లక్షల ఎల్‌ఓసీ చెక్కు మంజూరైంది. అదే విధంగా మార్టూరు మండలం ద్వారకపాడు గ్రామానికి చెందిన పాలపర్తి శారద కుమార్తెకు అత్యవసర చికిత్స అవసరమవడంతో ఎమ్మెల్యే ఏలూరి సిఫార్సుతో రూ.1,89,847ల ఎల్‌ఓసీ చెక్కు మంజూరు చేయించారు.ఈ సందర్భంగా మంజూరైన చెక్కులను స్థానిక నాయకులు కామేపల్లి హరిబాబు, మిన్నకంటి రవి,పెంట్యాల శరత్,పర్వతాలు, శ్రీరామ్మూర్తి, రామకృష్ణ,క్యాంపు కార్యాలయ ప్రతినిధులు చెక్కులను అందజేశారు.

# దర్శి ఆర్అండ్‌బి రోడ్డుకు మహర్ధశ

### - దర్శి నియోజకవర్గంలో 16 రహదారుల అభివృద్ధికి రూ.8.58 కోట్లు మంజూరు

### - కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**

రాష్ట్ర రవాణా,రోడ్లు, భవనాల శాఖ ద్వారా దర్శి నియోజకవర్గంలో 16 రహదారుల అభివృద్ధికి రూ.8.58 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌బాబుకి,రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**రహదారుల అభివృద్ధి కోసం మంజూరైన రోడ్ల వివరాలు :**

పొదిలి– వినుకొండ రోడ్డు నుండి పోతవరం, శామంతపూడి నుండి బొద్దికూరపాడు రోడ్డు రూ.3కోట్లు, దర్శి– అద్దంకి రోడ్డు నుండి మొహిద్దాపురం రూ.30లక్షలు, దర్శి– అద్దంకి రోడ్డు రూ.35లక్షలు, దర్శి– అద్దంకి రోడ్డు నుండి ముప్పరాజువారిపాలెం రూ.5లక్షలు, జాగర్లమూడి–బొప్పూడివారిపాలెం రోడ్డు రూ.15లక్షలు, దర్శి– ఆరవల్లిపాడు రోడ్డు రూ.5లక్షలు, రాజంపల్లి(పీవీ రోడ్డు 13 కి.మీ) నుండి దర్శి నుండి ఆరవల్లిపాడు వరకు రూ.5లక్షలు, పసుపుగల్లు నుండి ఈదర రూ.20లక్షలు, వెంకటాచలంపల్లి– దొనకొండ రోడ్డు రూ.8లక్షలు, దర్శి– ఆరవల్లిపాడు 10కి.మీ, బండివెలిగండ్ల నుండి చందలూరు రూ.5లక్షలు, కురిచేడు– ఆవులమంద రోడ్డు నుండి ముష్టగంగవరం రోడ్డు రూ.20లక్షలు, రాజంపల్లి– తూర్పు గంగవరం రోడ్డు బీకేపాడు రోడ్డు మీదుగా రూ.40లక్షలు, దొనకొండ– ఆరవల్లిపాడు నుండి గజ్జెలకొండ జడ్పీ రోడ్డు రూ.40లక్షలు, కురిచేడు– ఆవులమంద రూ.50 లక్షలు, జాగర్లమూడి– బొప్పూడివారిపాలెం రోడ్డు కి.మీ 12/2 నుండి రూ.30లక్షలు, తాళ్లూరు నుండి వెల్లంపల్లి రూ.2కోట్ల 50 లక్షలు.

# వేతనాలు పెంచే వరకు పోరాడతాం

### - తెలుగుదేశం ఇచ్చిన హామీ అమలు చేయాలి

### - సీఐటీయు నాయకులు డిమాండ్




**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచే వరకు సీఐటీయు పోరాడుతుందని జిల్లా ఉపాధ్యక్షులు తాండవ రంగారావు అన్నారు. విజయవాడలో అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సోమవారం ఉదయం నుంచి నిరవధిక ధర్నా చేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో మంగళవారం ఉదయం 5గంటలకు ధర్నా శిబిరం కూల్చి నిద్రపోతున్న 2 వేల మంది మహిళలను బలవంతంగా అరెస్టు చేసి నిర్బంధం ప్రయోగించడానికి వ్యతిరేకంగా దర్శిలో అంగన్‌వాడీలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ప్రదర్శన అద్దంకి రోడ్డు, పొదిలి రోడ్డులలో నిర్వహించి గడియారంస్తంభం సెంటర్‌లో పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ ఆందోళనలలో సీఐటీయు, అంగన్‌వాడీ దర్శి, కురిచేడు, దొనకొండ,తాళ్లూరు,ముండ్లమూరుమండలనాయకులుసందు వెంకటేశ్వరరావు,బోడపాటి హనుమంత రావు,తిరుపతమ్మ, ఫాతిమా, విజయరాణి, అంజమ్మ, సుజాత,లలితకుమారి,వెంకట రమణ, ప్రశాంతి, నాగమణి,మల్లేశ్వరి, లక్ష్మీదేవి, దేవిబాయి, గర్నిపూడి జాన్ సామ్యేల్, నిర్మల కుమారి పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీ, షర్మిలరెడ్డితో రాష్ట్ర అసంఘటిత కార్మికుల, ఉద్యోగుల చైర్మన్, దర్శి నియోజకవర్గం సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి



**దర్శి, మార్చి 3, ప్రభాతవార్త**

ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గొని పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామ స్థాయి నుంచి నిర్మాణాత్మక మార్పులు, భవిష్యత్ రాజకీయాల దిశపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. కైపు వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు మరిముఖ్యంగా వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని పార్లమెంటులో బలంగా వినిపించాలి మరి ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే దర్శి నియోజకవర్గాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి, దొనకొండ ని అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాల గురించి, తాగునీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను రాహుల్ గాంధీకి వివరించడం జరిగింది.

# ఉల్లగల్లు గ్రామంలో భారీ చోరీ

### - చోరీ జరిగిన ఇంటిని పరిశీలించిన ఎస్సై కమలాకర్, క్లూస్ టీం సీఐ రవీంద్రారెడ్డి





**ముండ్లమూరు, మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలోని పెద్ద ఉల్లగల్లు గ్రామంలోని శిఖాకొల్లి శంకరరావు ఇంటిలో సోమవారం రాత్రి భారీ జరిగింది. వివరాల్లోకి వెళితే ఉల్లగల్లు గ్రామానికి చెందిన శిఖాకొల్లి శంకరరావు తమ కుటుంబ సభ్యులతో కలిసి సింగరకొండలోని పుణ్యక్షేత్రమైన శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరుణాలకు వెళ్లి, స్వామివారిని దర్శించుకుని తిరుణాలను చూసి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చి చూడగానే తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న 11 సవర్ల బంగారం, 1/2 కేజీ వెండి, రూ.20,000 నగదు చోరీ జరిగినట్లు గుర్తించి ముండ్లమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శంకరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కే.కమలాకర్, ఏఎస్సై పీవీ హనుమంతరావు, హెడ్ వెంకటేశ్వర్లు, ఒంగోలు క్లూస్ టీం సీఐ కే.రవీంద్రారెడ్డి చోరీ జరిగిన గృహాన్ని పరిశీలించి, శంకరరావు కుటుంబ సభ్యులను చోరీ జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వేలిముద్రలు సేకరించి, శంకరరావు కుటుంబ సభ్యుల వేలి ముద్రలను సేకరించారు. ఈ సంఘటనపై విచారణ జరిపి నిందితులను పట్టుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. క్లూస్ టీం అధికారులు సీఐ రవీంద్రారెడ్డి, సునీల్, ఏసుబాబు వేలిముద్రను సేకరించారు.

## ఇళ్ల పన్నుల వసూళ్ల పక్రియను పరిశీలించిన జడ్పీ సీఈఓ చిరంజీవి

**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**

సంతనూతలపాడులో మంగళవారం నాడు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇళ్ల పన్నుల వసూళ్ల పక్రియను జిల్లా పరిషత్ సీఈఓ బి.చిరంజీవి పరిశీలించారు. ముమ్మరంగా గ్రామాల్లో హౌస్ టాక్స్ కలెక్షన్‌ను చేపట్టాలని జడ్పీ సీఈఓ చిరంజీవి ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడులో చెరుకూరి హరికృష్ణ గృహానికి సంబంధించి 12 వేల 675 రూపాయలను పంచాయతీ వారికి చెల్లించగా సీఈఓ చిరంజీవి ఈ సందర్భంగా పరిశీలించారు. సంతనూతలపాడులో ఇళ్ల పన్నులు వసూళ్లు అధికంగా ఉన్నందువల్ల గ్రామ సచివాలయాలలో 80 శాతం హౌస్ టాక్స్ వసూళ్లు చేసిన పంచాయతీ అభివృద్ధి అధికారాలను ఈ మేరకు డిప్యూటేషన్ వేయాలని జడ్పీ సీఈఓ చిరంజీవి ఎంపీడీవో డి.సురేష్‌బాబును ఈ సందర్భంగా ఆదేశించారు.అదే విధంగా వెలుగు సిబ్బంది, గ్రూపులను సమాయత్త పరిచి వెంటనే పన్నులు వసూళ్లకు చర్యలు చేపట్టాలని వెలుగు ఏపీఎం టి.బాబురావుకు జడ్పీ సీఈఓ చిరంజీవి కోరారు. సంతనూతలపాడులో హౌస్ టాక్స్ కలెక్షన్‌ను వేగవంతం చేయాలని సీఈఓ చిరంజీవి ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలోపంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు, పంచాయతీ బిల్ కలెక్టర్ బాబురావు, జూనియర్ అసిస్టెంట్ మణి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**IN THE COURT OF THE HON'BLE VI JUNIOR CIVIL JUDGE :: AT : : HYDERABAD**
**OS NO.5790/2024**

**Between:**
State Bank of India, Saidabad Branch, 17-2-586, Madannapet, Saidabad Main Road, Hyderabad-Telangana- 500 059.
Rep. by its Chief Manager
**...Plaintiff**

**And**

Mr. Chapala Gangadharudu.
**...Defendant**

To
Mr. Chapala Gangadharudu, S/o Sri Chandayya, SC Hostel Back Side, Govt. Hospital Road, Ulavapadu Village and Mandal Prakasam Dt, Andhrapradesh, Pincode- 534201

Please take notice that the above named plaintiff instituted the above suit against you as Defendants for recovery of Rs 8,06,315-00 Ps You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 13-03-2026 at 10.30 AM. In default of your appearance the suit will be heard and decided in your absence.

**By order of the Court**
**D.K. Lakshmi Kumari,**
Advocate
Flat no.304,
Manikanta Paradise Apart.
Dwarakanagar, Phase-II
Uppal, Hyderabad39
Counsel for the Plaintif

# జనాభా లెక్కలు సమగ్రంగా పూర్తి చేయాలి

## - జేసీ పి. శ్రీనివాసులు మే 1 నుంచి మొదటి విడత ప్రారంభం

## - డిజిటల్ విధానంలో ఇళ్ల గణన, కుల గణన




**మార్కాపురం, మార్చి 3,ప్రభాతవార్త**

2027 జనాభా లెక్కల సేకరణను సమగ్రంగా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామంలోని జవహర్‌నవోదయ కేంద్రీయ విద్యాలయంలోమంగళవారం జిల్లాలోని తహశిల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులు, ఏఎస్‌వోల కోసం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మొదటి రోజున ఆయన పాల్గొని కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి అధికారి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సెన్సెస్ విభాగం అదనపు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈసారి జనాభా లెక్కల సేకరణను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మొదటి విడతలో ఇళ్ల గణన, రెండో విడతలో జనాభా లెక్కలతోపాటు కుల గణన చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ వివరాలను స్వయంగా ఇంటి వద్ద నుంచే నమోదు చేసుకునేలా ప్రత్యేక పోర్టల్ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఇక్కడ మూడురోజులపాటు శిక్షణ పొందిన అధికారులు మండల స్థాయిలో సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. మార్కాపురం జిల్లాలో మొత్తం 497గ్రామాల్లో జనాభా లెక్కల సేకరణ చేపట్టి విజయవంతం చేయాలని ఆదేశించారు. మే 1 నుంచి 30వ తేదీ వరకు మొదటి విడత కార్యక్రమాన్ని సమగ్రంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బీసీహెచ్. ఓబులేసు, మార్కాపురం ఆర్డీవో పి ప్రభాకర్, కనిగిరి ఆర్డీవో ఎం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను తక్షణమే రద్దు చేయాలి

## - అంగన్వాడీలకు రూ.26వేలు కనీస వేతనం అమలు చేయాలి

## - మార్కాపురంలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**మార్కాపురం, మార్చి 3,ప్రభాతవార్త**

మార్కాపురం జిల్లా కేంద్రంలో సీఐటీయు ఆధ్వర్యంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుతో అంగన్వాడీల అక్రమ అరెస్టులను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం నుండి కోర్టు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కోర్టు సెంటర్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డికెయం రఫీ మాట్లాడుతూ అంగన్వాడీలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడటంఅత్యంత దుర్మార్గమని మండి పడ్డారు. అరెస్టు చేసిన అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, జీతాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల వేతనాలు పెంచుతూ చిరు ఉద్యోగులైన అంగన్వాడీల వేతనాల పెంపుపై ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం అన్యాయమని విమర్శించారు. పెరిగిన ధరలు,ఇంటి అద్దెలు, కరెంటు చార్జీలు,స్కూల్ ఫీజులు వంటి భారాల నేపథ్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా జీతాలు పెంచకుండా పని చేయించడం అన్యాయమని పేర్కొన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కోకన్వీనర్ కే.సుబ్బరాయుడు,జి.హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ బాలనాగయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ లక్ష్మి, ప్రభావతి, రమాదేవి, హనుమాన్ అంజలి, మల్లేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడటం మానుకోవాలి

## - అభివృద్ధి చేసి చూపిస్తాం - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి





**మార్కాపురం, మార్చి 3,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈరోజు రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. పొదిలి మండలం కుంచెపల్లి గ్రామానికి చెందిన వరికుంట్ల పౌలు, వరికుంట్ల వినోద్ ఆధ్వర్యంలో 15కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనపై నమ్మకంతో పాటు,నియోజకవర్గంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లా తీసుకువస్తామని చెప్పాం తీసుకొచ్చామని, వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మాటిచ్చాం ఖచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వంపై అవాకులు, చవాకులు మాట్లాడటం మానుకోవాలని, అభివృద్ధి చేసి చూపిస్తామని చూసి మాట్లాడండి, చేతనైతే ప్రజలకు సేవ చేయండి, అంతే కానీ నిరాధార విమర్శలు చేయవద్దని ఘాటుగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ సమస్యలను పరిష్కారం చేయాలి

## - అంగన్వాడీ యూనియన్ గిద్దలూరు ప్రాజెక్టు కార్యదర్శి ఏ మునెమ్మ




**గిద్దలూరు, మార్చి 3, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ గిద్దలూరు ప్రాజెక్టుకార్యదర్శి ఏ మునెమ్మ డిమాండ్ చేశారు. గిద్దలూరు సిడిపిఓ కార్యాలయం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతవారం నుంచి అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయాలని,వేతనాలు పెంచాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. మార్చి రెండు తేదీన వేలాదిమంది అంగన్వాడి వర్కర్లు ప్రశాంతంగా నిరసన తెలియజేస్తుంటే మూడవ తేదీ ఈరోజు తెల్లవారుజామున 5 గంటలప్పుడు అంగన్వాడి వర్కర్లను అక్రమంగా అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వం దుర్మార్గమైన వైఖరిని అన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడి వర్కర్లకు వేతనాలు పెంచాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి అడుగుతున్న పట్టించుకోకుండా అంగన్వాడీ వర్కులను చిన్నచూపు చూస్తూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీస్ నిర్బంధం ప్రయోగించి అక్రమంగా అరెస్టు చేయడం అంగన్వాడి వర్కలను అవమానపరచమని అన్నారు. మహిళా సాధికారత ప్రభుత్వాన్ని చెప్పుకునే కోటమీ ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకునే మార్చి నెల ఇలా అంగన్వాడి వర్కర్లపై నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు. అంగన్వాడి వర్కల సమస్యల పరిష్కారం చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ నిరసన ర్యాలీలో అంగన్వాడి వర్కర్స్ నాయకురాలు రత్న,లక్ష్మీదేవి, ఆర్ వి ఎస్ నాగలక్ష్మి,కృష్ణవేణి, అంగన్వాడి టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

# గొట్టిపాటి లక్ష్మి కృషితో రోడ్డుకు నిధులు మంజూరు



**తాళ్లూరు,మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలోని పలు రోడ్లకు దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కృషి తో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పలు కీలక అర్‌అండ్ బీ రోడ్ల అభివృద్ధికి రూ.5.90 కోట్ల నిధులు మంజూరు చేస్తూ రోడ్డు భవనాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు. రాజంపల్లి నుంచి తూర్పు గంగవరం ఆర్ అండ్ బీ రోడ్డు (వయా బొద్దికూరపాడు )రూ. 40లక్షలు, తాళ్లురు నుంచి వెల్లంపల్లి రోడ్డు కు రూ.2.50 కోట్లు,బొద్దికూరపాడు నుంచిశామంతపూడి రోడ్డుకు రూ. 3 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

# ఎట్టకేలకు ఆర్అండ్‌బి రహదారికి వంతెన నిర్మాణాలు ప్రారంభం




**సంతనూతలపాడు, మార్చి 3, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం ఎండ్లూరు డొంక పరిధిలో గత ఎంతో కాలంగా దెబ్బతిన్న ఆర్అండ్‌బి రహదారి వంతెన నిర్మాణాలను ప్రారంభించారు. ఇందు కొరకు ఆర్అండ్‌బిశాఖ 22 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ప్రస్తుతం వంతెనల నిర్మాణం కొరకు వాహనాలు రాకపోకలను పునరుద్ధరించేందుకు గాను పక్కనే గల కాలువ వద్ద డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ వంతెనలు నిర్మాణం నిమిత్తం సుమారు రెండు నెలల వరకు పట్టే అవకాశం కలదు. అయితే చీమకుర్తి పరిధిలోని రామతీర్థం వద్ద గల గ్రానైట్ హెవీ వాహనాలు డైవర్షన్ రోడ్డులో పయనిస్తే మున్ముందు మరింత కష్టంగా మారుతుంది. గ్రానైట్ హెవీ వాహనాలను సంతనూతలపాడు నుండి మంగమూరు మీదుగా కొంత కాలం మలిస్తే డైవర్షన్ రోడ్డుకు ఇబ్బంది ఉండదు. గతంలో చాలా కాలం వల్ల ఎండ్లూరు డొంక వంతెన రహదారి దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తదుపరి ఆర్అండ్‌బి శాఖ తాత్కాలికంగా పైపులైను వేసి వాహనాలను క్రమ బద్ధీకరించారు. ఈ రోడ్డు కూడా దెబ్బతినడంతో ఆర్అండ్‌బి శాఖ వారు వంతెనలు ఏర్పాటుకు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు.

# కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందే

## - అరెస్టు చేసిన మా నాయకులను విడుదల చేయాల్సిందే



**యర్రగొండపాలెం, మార్చి 3, ప్రభాతవార్త**

అంగన్‌వాడీలకు నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సిందేనని సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. యర్రగొండపాలెం పట్టణంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ముందు చేపట్టిన నిరసన కార్యక్రమంలో అంగన్‌వాడీలు 26 వేలు వేతనం ఇవ్వాల్సిందేనని, విజయవాడలో మహాధర్నాలో పాల్గొన్న మా నాయకులను నిరంకుశంగా అరెస్టులు చేశారంటూ మండిపడ్డారు. వెంటనే బేషరతుగా విడుదల చేయాలని నినదించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైన కారణానా ఇచ్చిన హామీలను విస్మరించడం పట్ల గత నెలలో రిలే నిరాహార దీక్షలు పూర్తి చేసి మార్చి 2న ఛలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మా నాయకులను అరెస్టులు చేశారంటూ నిరసనకు దిగారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులతో పాటు మహిళ, నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం



**చీరాల, మార్చి 3, ప్రభాతవార్త**

ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పందిళ్ళపల్లి మెయిన్ సెంటర్ వద్ద జనసేన పార్టీ యువ నాయకుడు, రాష్ట్ర బీసీ యువజన నాయకుడు వినయ్ గౌడ్ ఆధ్వర్యంలో ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి ఉద్యమం సభ్యత్వం తీసుకోవడంలో విరివిగా పాల్గొంటున్న పందిళ్ళపల్లి ప్రజానికం. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, వేటపాలెం మండల అధ్యక్షులు డాక్టర్ ఉగ్గిరాల మార్కండేయులు, జనసేన పార్టీ యువ నాయకులు పసుపులేటి సాయి, ఐటీ కోఆర్డినేటర్ భూపతి మనోజ్, ప్రకాశం జిల్లా చేనేత విభాగ అధ్యక్షులు కర్ణా కిరణ్ తేజ్, యువ నాయకులు గంటా తేజ, నంద, మైనార్టీ నాయకులు షేక్ భాష చిన్ని, సాయి, కేటీఆర్ తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌కోట జడ్పీ హైస్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**లింగసముద్రం, మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలోని వీఆర్ కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఇందిరమ్మ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు మార్చి 16 నుంచి జరుగు పబ్లిక్ పరీక్షల యొక్క ప్రాముఖ్యత పాటించాల్సిన మెలుకువలు గురించి హెచ్ఎం ఇందిరమ్మ బోధన, బోధనేతర సిబ్బందికి తెలియపరిచారు. జడ్పీ హైస్కూల్ వీఆర్ కోటలో సుమారు మూడు లక్షల విలువ గల షెడ్డును, స్టేజిని నిర్మించిన దాత కోట శ్రీనివాసరావు ధర్మపత్ని శారదని హెచ్ఎం ఇందిరమ్మ, పాఠశాల సిబ్బంది మరియు విద్యాశాఖ అధికారులు కే.మాల్యాద్రి, శివకుమార్, నాయకులు వంకాయలపాటి మాల్యాద్రి, బోయిళ్ళ కొండపనాయుడు, ముప్పా రాజు లక్ష్మీ నరసింహం, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థి, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహించారు. పాఠశాల జూనియర్ అసిస్టెంట్ చరణ్ కుమార్తె తన్విక భరతనాట్యంతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, నాయకులు, విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం

## -141 మందికి రూ.1.07 కోట్లు సీఎం సహాయనిధి పంపిణీ



**మార్కాపురం, మార్చి 3,ప్రభాతవార్త**

ప్రతి పేదవానికి మెరుగైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 141 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుండి మొత్తం రూ.1,07,04,907 (ఒక కోటి 7లక్షల 4,907) చెక్కులను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అందజేశారు. కొనకనమిట్ల, పొదిలి, తర్లుపాడు, మార్కాపురం మండలాలు మరియు టౌన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ఈ సహాయాన్ని అందుకున్నారు. వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇది పేదల సంక్షేమం కోరుకునే ప్రభుత్వమని పేదరిక నిర్మూలనే మన ముఖ్యమంత్రి ధ్యేయం అని కందుల నారాయణ రెడ్డి తెలిపారు.

# నేడే కర్లపాలెంలో ఇళ్లపట్టాల పంపిణీ

## - సకలసౌకర్యాలతో పునరావాస కాలనీ హాజరుకానున్న మంత్రి జనార్ధన్‌రెడ్డి



**కందుకూరు మార్చి 3, ప్రభాతవార్త**

గుడ్లూరు మండలం సాలిపేట పంచాయతీ కర్లపాలెం ఆర్ఆర్‌కాలనీలో బుధవారం ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. రామాయపట్నం పోర్టు భూనిర్వాసితులకు సకల సౌకర్యాలతో పునరావాసకాలనీ నిర్మించనున్నారు. ఇందులో బాగంగా ఆర్ఆర్‌కాలనీలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డుభవనాల శాఖామంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. రామాయపట్నం పోర్టు భూనిర్వాసితులకు ప్రభుత్వం బారీ నగారా అందిస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందుకోసం సుమారు రూ.41కోట్లు వెచ్చించనున్నారు. 43.67 ఎకరాల విస్తీర్ణంలో 371మంది లబ్ధిదారులకు పక్కా గృహాలు నిర్మిస్తున్నారు. ఒక్కొక్కరికి 5 సెంట్ల విస్తీర్ణంలో సుమారు రూ.10 లక్షలుతో గృహ నిర్మాణం చేపట్టనున్నారు. కాలనీలో మౌళిక వసతులైన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం,పాఠశాల,అంగన్వాడీ కేంద్రం,విద్యుత్ సౌకర్యం,ఓవర్ హెడ్ ట్యాంక్,ఇంటింటికి రక్షిత మంచినీటి కొళాయి రామాలయం, నిత్యవసర వస్తువులషాపులుతోపాటు కాలనీచుట్టూ ప్రహరీ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# ప్రకాశం కళాశాల విద్యార్థినిల ప్రతిభ



**కందుకూరు మార్చి 3, ప్రభాతవార్త**

పట్టణంలోని పకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినిలు పి.శ్రావణి,ఎన్,నాగవేణిలు జాతీయ స్థాయి సదస్సులో ప్రతిభను చాటారు. పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్ కళింగ విశ్వవిద్యాలయం నిర్వహించిన సస్టైనబుల్ ఫ్యూచర్స్ కల్చరల్,సొసైటీ అండ్ గవర్నెన్స్ ఇన్ ట్రాన్సిషన్" అను అంశాలపై 2 రోజులపాటు ఆన్‌లైన్‌లో జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో సస్టైనబుల్ విలేజెస్"అంశంపై పి.శ్రావణి,ఎన్.నాగవేణి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందారని కళాశాల కరస్పాండెంటు డా॥ విజయశ్రీనివాస్ తెలిపారు. ఇందుకు ఆయనతోపాటు కళాశాల డీన్ ముప్పా లక్ష్మణరావు ప్రిన్సిపాల్ డా.సీహెచ్.రవి కుమార్,వైస్ ప్రిన్సిపల్ హరిబాబులు సదరు విద్యార్థినిలను అభినందించారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తాయని విజయశ్రీనివాస్ అన్నారు.

# వైభవంగా జ్యోతుల ఉత్సవం

## - చౌడమ్మ దేవతకు మొక్కులు తీర్చుకున్న భక్తులు



**కొనకనమిట్ల, మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలోని మునగపాడు చౌడమ్మ తిరునాళ్ల సోమవారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా పల్నాడు, గుంటూరు జిల్లాల నుంచి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ, వైకాపా ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. పాటకచేరీలు ఎంతో అలరించాయి.

**వైభవంగా జ్యోతుల ఉత్సవం :**

మంగళవారం వేకువజామున జ్యోతుల ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొగట క్షత్రీయుల ఆధ్వర్యంలో జ్యోతుల ఉత్సవం జరిగింది. జ్యోతులతో ఊరేగింపు చేసుకుంటూ ఆలయం వద్దకు చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు.

# కందుకూరులో అంగన్వాడి నిరసన



**కందుకూరు మార్చి 3, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సీడీపీవో కార్యాలయం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేతలు గౌస్, వీవీపాలెం కన్వీనర్స్ గౌస్,చెన్నకేశవులు మాట్లాడుతూ విజయవాడలో అంగన్వాడి అక్రమ అరెస్టులను ఖండించారు. అంగన్‌సిబ్బందికి రూ.26వేలు కనీస వేతనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంగన్వాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు సహకరించండి - ఎస్సై బాలక్రిష్ణ



**కందుకూరు మార్చి 3, ప్రభాతవార్త**

శాంతి భద్రతల నిర్వహణకు సహకరించాలని కందుకూరు రూరల్ ఎస్సై ఏ బాలక్రిష్ణ ప్రజలకు సూచించారు. నేరప్రవృత్తిని,అసాంఘిక చర్యలనువిడనాడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం బాలక్రిష్ణ వార్త ప్రతినిధితో మాట్లాడారు. కందుకూరు డీఎస్పీ సిహెచ్.సుబ్రహ్మణ్యం మరియు సీఐ అన్వర్‌బాషాల ఆధ్వర్యంలో డివిజన్‌లో శాంతిభద్రతలపై గట్టినిఘా ఉంచామన్నారు. సీసీ కెమెరాలతో పాటు ఆధునిక సాంకేతికపరిజ్ఞానంతో ముందుకు పోతున్నట్లు తెలిపారు. ప్రధానంగా మానవతా విలువలుతోపాటు నైతిక విలువలను ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. తమ హక్కులు కాపాడుకోవాలని ఎదుటివారి హక్కులకు భంగం వాటిల్లకుండా వ్యవహరించాలని ఆయన సూచించారు. తద్వారా మంచిసమాజం నిర్మాణానికి సహకరించినట్లువుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తప్పుడు పిర్యాదులుచట్టరీత్యా నేరమన్నారు. అర్జీదారుడి పిర్యాదులో అవాస్తవాలు, అక్రమాలుఉన్నట్లయితే సదరు వ్యక్తులపై తిరిగి కేసులు బనాయించొచ్చన్నారు. అదేవిదంగా ప్రజల ప్రభుత్వ,హక్కులకు,ఆస్తులకు భంగం కలిగితే వెంటనే పూర్తి ఆధారాలతో పోలీసులకు తెలియచేయాలన్నారు. అసాంఘికచర్యలను ప్రోత్సహించినా, నిర్వహించినా శిక్షార్హులన్నారు. ఇటవల ఓగూరులో ఆత్మహత్యకు సంబందించిన కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒకపుడు 22మంది సిబ్బంది పనిచేసేవారు. నేడు కేవలం 10మంది సిబ్బంది విధుల్లో ఉండడం గమనార్హం. దీంతో దర్యాప్తులో జాప్యం అవుతుంది. ఈ విషయమై ఎస్సై మాట్లాడుతూ కేసుల పురోగతిలో లక్ష్యసాధనకు కృషిచేస్తున్నట్లు వివరించారు.

## శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌కు షోకాజ్ నోటీసు



**సింగరాయకొండ, మార్చి 3,ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని మూలగుంటపాడు గ్రామంలో ఉన్న శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్‌కు త్రిసభ్య కమిటీ సభ్యురాలు, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సి.వి. రేణుక షోకాజ్ నోటీసు అందజేసినట్లు మంగళవారం పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ కోచింగ్ సెంటర్‌లో 6వ తరగతి చదువుతున్న కనిగిరికి చెందిన సయ్యద్ తౌషిక్ (11) గత నెల 14న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు, కమ్యూనిస్టు పార్టీలు మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. ఘటనపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీని నియమించి విచారణ చేపట్టారు. ఫిబ్రవరి 22న కమిటీ సభ్యులు డీఈఓ సి.వి. రేణుక, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధురి, తహసీల్దార్ ఎన్‌విబి రాజేష్ పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థుల హాస్టల్ గదులు, తరగతి గదులు, పాఠశాల రికార్డులను పరిశీలించి సిబ్బందిని ప్రశ్నించారు. విచారణలో పాఠశాలకు సంబంధించి పలు లోపాలు, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు గుర్తించినట్లు డీఈఓ తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా 2026-27 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసు అందిన వెంటనే వివరణ కోరామని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిఈఓ తెలిపారు.

## ఘనంగా హోలీ పండుగ వేడుకలు



**కొనకనమిట్ల, మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలోని పలు గ్రామాలలో హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు,యువకులు ఉత్సాహం గా రంగులు చల్లుకొని వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకుని పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, పెద్దారికట్ల, చిన్నారికట్ల తదితర గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

## జాతీయ స్థాయిలో సత్తా చాటిన సెయింట్ ఆన్స్ వాలీబాల్, కబడ్డీ జట్లు



**వేటపాలెం, మార్చి 5, ప్రభాతవార్త**

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విద్యార్థుల వాలీబాల్ జట్టు రైజ్ కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, ఒంగోలు వారిచే నిర్వహించబడింది. జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్‌లో మెన్స్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా మహిళల కబడ్డీ జట్టు విన్నర్స్‌గా గెలుపొందినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కళాశాల కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావు సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. రైజ్ కృష్ణ సాయి గ్రూపు ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఒంగోలు వారిచే నిర్వహించబడిన జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ రైజ్ ఫ్యూజన్-2026లో మెన్స్ వాలీబాల్ పోటీలలో విన్నర్స్‌గా, మహిళల కబడ్డీ జట్టు విన్నర్స్‌గా గెలుపొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.జగదీష్ బాబు తెలిపారు. వాలీబాల్ పోటీలలో 26 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో ఆంధ్రకేసరి యూనివర్సిటీ జట్టుతో పోటీ పడి గెలిచినట్లు తెలిపారు. ఈ జట్టులో ఆర్.రమణ, జీవీఆర్ తేజారెడ్డి, కే.ఆంద్రూస్, జి.మైకేల్, కే.డాని, కే.సాయి కుమార్, ఎం.రేవంత్, వెంకట మణి కుమార్‌ల జట్టు పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. మహిళా కబడ్డీ పోటీలలో 18 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌లో రైజ్ ఇంజనీరింగ్ కళాశాల జట్టుతో పోటీపడి ఫైనల్స్‌లో విన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. వి.మానస, కే.అనిత, బి.ప్రవల్లిక, బి.శతి పావని, పి.హరిణి, టి.శ్రీవిద్య, డి.రమ్య, ఎం.శ్రావణి, ఎం.సోనాలి, జి.శ్రీపూజిత, ఎం.అనిత, సి.సంజనల జట్టు పాల్గొన్నట్లు కళాశాల వ్యాయామ అధ్యాపకులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్‌వి రమణమూర్తి,డాక్టర్ సి.సుబ్బారావు, డైరక్టర్(అక్రిడిటేషన్స్) వనమా దొర నాగ సాయి నాథ్, డైరక్టర్(అడ్మినిస్ట్రేషన్) వివిధ విభాగాధిపతులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని వాలీబాల్ జట్టు, మహిళల కబడ్డీ జట్టుకు అభినందనలు తెలియజేశారు.

# సౌభ్రాతృత్వానికి నిదర్శనం

## - టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణ టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం కనిగిరి ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ విందుకు పట్టణ ప్రజలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉపవాస దీక్ష అనంతరం ముస్లిం సోదరులు ఇఫ్తార్ ఆరగించి ప్రత్యేక దువాలు చేశారు. టాక్సీ ఓనర్లు, డ్రైవర్లు, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు కలగాలని, పట్టణ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సౌహార్ద వాతావరణంలో విందును విజయవంతం చేశారు. సామరస్యాన్ని, స్నేహభావాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ ఇఫ్తార్ విందును నిర్వహించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కనిగిరి పట్టణ టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ తరుపున పట్టణ ప్రజలందరికి, ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

8_8.qxd 3/4/2026 12:20 AM Page 1



## కనిగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకుల్లో ఫుల్ జోష్

### - వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జీలను అభినందించిన ఎమ్మెల్యే ఉగ్ర



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**

కనిగిరి అమరావతి మైదానంలో సోమవారం పట్టణ తెలుగుదేశం పార్టీకి చెందిన 20 వార్డుల ఇన్‌చార్జిలు, 34 బూత్ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ ఆధ్వర్యంలో వార్డు అధ్యక్షులు, ఇన్‌చార్జిల మధ్య సమన్వయం అద్భుతంగా ఉందని, ఒక్క చిన్న కంప్లైంట్ కూడా లేకుండా పార్టీ శ్రేణులు క్రమశిక్షణతో పని చేస్తున్నారని స్పష్టంగా అభినందించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి, అధికారుల ద్వారా పరిష్కరించినప్పుడే ప్రజల మనసుల్లో స్థానం సంపాదించగలమని సూచించారు. పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, కనిగిరికి సిటీ లుక్ వచ్చేలా స్పెషల్ డిజైనర్‌తో సమగ్ర సుందరీకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం, వీధి దీపాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, సైడు కాలువలు వంటి మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యమన్నారు. అలాగే వాగులు, చెరువు కట్టపై ప్రజలు స్వచ్ఛమైన వాతావరణంలో నడక చేయడానికి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాను చేపట్టే ప్రతి అభివృద్ధి కార్యక్రమం పట్టణ భవిష్యత్తు, భావితరాల మేలు దృష్ట్యా మాత్రమేనని, ఓట్ల కోసం కాదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు చూపిన చొరవకు కితాబు ఇచ్చి, ఇదే జోష్ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశం అనంతరం కనిగిరి పట్టణ టీడీపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. భవిష్యత్తులోనూ ఇదే సమన్వయంతో ప్రజల మధ్య ఉండి అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తామని నాయకులు తెలిపారు.

## సీఎం చంద్రబాబు చేయూత.. గడపకే చేరింది

### - ఉగ్ర ఆలోచన అదిరింది



**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**

కనిగిరినియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీకి ఈసారి మానవత్వపు ముద్ర పడింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అందించిన ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వినూత్న ఆలోచనతో నేరుగా లబ్ధిదారుల ఇంటి గడపకు చేర్చడం ప్రత్యేకతగా నిలిచింది. గతంలో చెక్కులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేసే విధానం అమల్లో ఉండేది. అయితే ఈసారి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ప్రభుత్వ సహాయం ప్రజల గడప దాటాలి అన్న ఎమ్మెల్యే సూచనల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. వైద్య సేవలు పొందిన తరువాత ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ఒక అండగా నిలిచిందని లబ్ధిదారులు తెలిపారు. ముఖ్యమంత్రి అందించిన సహాయం ఇంటి వద్దకు చేరుకోవడం తమకు కేవలం చెక్కు మాత్రమే కాక, ఒక మానసిక బలాన్ని ఇచ్చిందని భావోద్వేగంతో పేర్కొన్నారు. ఆనందభాష్పాలతో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతకుముందు క్యాంపు కార్యాలయంలో చెక్కులు అందుకున్నప్పుడు లబ్ధిదారులు నిశ్శబ్దంగా తీసుకుని వెళ్లిపోయేవారని, ఇప్పుడు ఇంటికే చేరడం వల్ల ప్రభుత్వ పథకం పట్ల అవగాహన పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల సమక్షంలో చెక్కులు అందజేయడం వల్ల పారదర్శకత పెరిగిందని, ప్రభుత్వంపై విశ్వాసం మరింత బలపడుతోందని పేర్కొన్నారు. 'ఎమ్మెల్యే ఉగ్ర ఆలోచన అదిరిందయ్యా చంద్రం లాగా.. భలే భలే మంచి ఐడియా' అంటూ నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతిపరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి వెళ్లి చెక్కుల పంపిణీ చేయడం వల్ల పార్టీ శ్రేణుల్లోనూ పాజిటివ్ స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం కేవలం ఆర్థిక ఉపశమనం మాత్రమే కాకుండా కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ధైర్యం నింపే చేయూతగా మారాలని ఈ కార్యక్రమం సందేశమిస్తోంది. భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తే ప్రభుత్వ సహాయం మరింత ప్రభావవంతంగా ప్రజలకు చేరుతుందని స్థానికులు సూచిస్తున్నారు.

## పులి శాంతి ఇంట హోలీ సందడి





**కనిగిరి, మార్చి 3, ప్రభాతవార్త**

కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ శాంతి, గోవర్ధన్‌రెడ్డి నివాసంలో మంగళవారం హోలీ పండుగ ఆనందోత్సాహాల మధ్య జరిగింది. కుటుంబ సభ్యుల సమక్షంలో ఇంటి వాతావరణంలోనే రంగుల పండుగను నిర్వహించారు. పెద్దలు, చిన్నారులు సహస్ర, ఆరోహి, అన్విక, సద్రు కలిసి పరస్పరం రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిఠాయిల పంపిణీతో ఆత్మీయ వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యుల మధ్యనే వేడుకలు నిర్వహించడం విశేషంగా నిలిచింది. హోలీ పండుగ ప్రతి ఇంట్లోఆనందం, ఐక్యతను తీసుకురావాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి పులి శాంతి పండుగను జరుపుకున్నారు.

## లక్ష్మీనరసింహాస్వామి హుండీ ఆదాయం 1.22 లక్షలు



**అద్దంకి , మార్చి 3,ప్రభాతవార్త**

సింగరకొండ తిరునాళ్ళ సందర్భంగా కొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి తిరునాళ్ళ నాలుగు రోజులకు సంబంధించి స్వామివారి హుండీని మంగళవారం ఉదయం లెక్కించారు. 1,22,757 రూపాయలు ఆదాయం హుండీ ద్వారా లభించినట్లుపరిశీలకు ఎం. వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుంజి శ్రీనివాసరావు, ఈఓ మద్దినేని శ్రీనివాసరావు, సిబ్బంది, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రగహణం సందర్బంగా సింగరకొండలోని రెండు ఆలయాలు మూసివేత

### - నేడు 7 గంటలకు ఆలయాలు పునః ప్రారంభం





**అద్దంకి ,మార్చి 3,ప్రభాతవార్త**

చంద్రగహాణాన్ని పురస్కరించుకొని సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, కొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయాలను మంగళవారం ఉదయం వేదపండితులు, అధికారులు, పాలకమండలి సభ్యులు మూసివేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఆయా ఆలయాలను యధావిధిగా తెరవడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

## నేడు కుందుర్రు, సజ్జాపురాలలో ఉచిత సైకిళ్ళ పంపిణీ

### - విద్యార్థులకు అందజేయనున్న మంత్రి తనయుడు



**సంతమాగులూరు, మార్చి 3, ప్రభాతవార్త**

సంతమాగులూరు మండలంలోని కుందుర్రు, సజ్జాపురం గ్రామాలలో బుధవారం ఉదయం ఉచిత సైకిళ్ళ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ కుందుర్రు పాఠశాలలో ఉదయం 10గంటలకు, సజ్జాపురం పాఠశాలలో ఉదయం 11గంటలకు సైకిళ్ళ పంపిణీ చేయనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు వాసిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## వైసిపి జెండాను తగలబెట్టడం

### - తిరునాళ్ళ పవిత్రకు భంగం కలిగించటమే - డాక్టర్ చింతలపూడి



**అద్దంకి మార్చి 3,ప్రభాతవార్త**

సింగరకొండ తిరునాళ్ళలో వైసిపి జెండాను తగలబెట్టడం తిరునాళ్ళ పవిత్ర వాతావరణం, చెడగొట్టడంతోపాటు, వైసిపి ఆత్మాభిమాన జెండాను కించపరచడంపై అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో ఖండించారు. మాజెండాను తగలబెట్టడం, మీ బలహీనతకు నిదర్శనం, మా బలం చూసి, మీరు భయపడుతున్నారనదే స్పష్టం అవుతుందని అశోక్ కుమార్ అన్నారు. తిరునాళ్ళ రాజకీయాలకు అతీతంగా, పవిత్రంగా, జరగాలి కాని, రెచ్చగొట్టే విధానంలో వుండకూడదని ఆయన హితవు పలికారు. ద్వేషానికి మేము భయపడం, తలవంచం, ప్రజాస్వామ్యమే ఈ సంఘటనకు సమాధానం చెబుతుందని డాక్టర్ చింతలపూడి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రభలపై వైసిపి నేతలు సందడి

### - కార్యకర్తలలో ఉత్తేజం



**అద్దంకి, మార్చి 3,ప్రభాతవార్త**

సింగరకొండ శ్రీప్రసన్నాంజనేయస్వామి 71వ వార్షిక తిరునాళ్ళ పురస్కరించుకొని అద్దంకి పట్టణం, క్రొత్తరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన వైసిపి సానుభూతిపరులు, రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా రాత్రికి ఏర్పాటు చేసిన ఈ ప్రభలను వైసిపి నేతలు మాజీ మంత్రి పేర్ని నాని, అద్దంకి ఇన్‌చార్జి డాక్టర్ అశోక్ కుమార్, చుండూరి రవిబాబుతోపాటు అద్దంకి నియోజకవర్గంలోని ముఖ్య నేతలు వీరి వెంట వున్నారు. ఆయా నేతలు ప్రభలను దర్శించి, కార్యకర్తలను ఉత్తేజపరిచారు.

**తిరునాళ్ళ విజయవంతం పట్ల చింతలపూడి అభినందనలు :**

సింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ళను విజయవంతంగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికీ అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానంగా ప్రభల ఏర్పాటు చేసిన వైసిపి నేతలకు, దేవస్థాన పాలకమండళ్ళులకు, ఆలయ ఈఓలకు, పోలీస్ అధికారులకు, రెవిన్యూతోపాటు పలు శాఖల అధికారులు, సేవలు అందించిన వాలంటీర్లకు, లక్షలాధిగా తిరునాళ్ళకు వచ్చి శాంతియుత వాతావరణంలో తిరునాళ్ళ విజయవంతం చేసిన భక్తులు, ప్రజలకు ఆయన ధన్యవదాలు తెలియజేశారు.

## వైభవంగా రాజ్యలక్ష్మి కళ్యాణ మహోత్సవం

### - చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేత





**సింగరాయకొండ, మార్చి 3, ప్రభాతవార్త**

మండలంలో దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం లక్ష్మీజయంతి సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం రాజ్యలక్ష్మి అమ్మవార్ల మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం రాజ్యలక్ష్మి సమేత శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేక పూజలుతో దర్శించుకొని తీర్థ ప్రసాదాలను భక్తులుకు అందజేశారు. చంద్రగ్రహణం నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేశారు. సాయంత్రం 7 గంటల నుంచి శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, నిత్య నైవేద్యాలు సమర్పించనున్నారు. భక్తులకు స్వామివారి దర్శనం బుధవారం ఉదయంనుంచి అనుమతించబడుతుందని దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలి మండలి చైర్మన్ సన్నిబోయిన శ్రీనివాసులు, ఈవో కృష్ణవేణి, అర్చకులు ఉదయగిరి వెంకట శేష లక్ష్మీనరసింహచార్యులు, ఉదయగిరి సుదర్శనాచార్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## సింగరకొండ ఆలయాలలో పూజలు నిర్వహించిన వైసిపి నేతలు





**అద్దంకి ,మార్చి 3,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి, శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయాలను తిరునాళ్ళ సందర్బంగా సోమవారం రాత్రి వైసిపి నేతలు పూజలు నిర్వహించారు. అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పేర్ని నాని, చుండూరి రవిబాబు,తోపాటు అద్దంకి నియోజక వర్గంలోని ముఖ్య నేతలు ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. వీరి వేదపండితులు ఆశీర్వచనాలతోకూడిన తీర్థ ప్రసాదాలను అందజేశారు.

## నేడు చింతలపూడి పర్యటన వివరాలు



**అద్దంకి మార్చి 3, ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ బుధవారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. సాయంత్రం 6గంటలకు అద్దంకి మండలం,కలవకూరు జరిగే వివాహ్ కార్యక్రమం, రాత్రి 7 గంటలకు కొరిశపాడు మండలం రాచపూడిలో వివాహ్ కార్యక్రమం, రాత్రి 8గంటలకు సంతమాగులూరు మండలం, ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద పివిఆర్ రెసిడెన్సీలో జరిగే వివాహ్ కార్యక్రమంకు అశోక్‌కుమార్ హాజరు అవుతారని పార్టీ కార్యాలయం విడదలచేసిన ప్రకటనలో తెలిపారు.

## సామాజిక సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదానం





**అద్దంకి మార్చి 3,ప్రభాతవార్త**

సింగరకొండ 71వ వార్షిక తిరునాళ్ళ సందర్బంగా సోమవారం ఉదయం నుండి తిరునాళ్ళ తెల్లవారుజామువరకు సింగరకొండలో గల సామాజిక సత్రాలలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పరిసరాలతోపాటు ఆలయానికి వెళ్ళే ప్రారంభంలో వున్న వివిధ సామాజిక వర్గాల సత్రాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొన్ని సత్రాల వారు ప్రత్యేకంగా వారి వారి సామాజిక వర్గాల వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించగా, మరికొన్ని సామాజిక వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించే సత్రాలలో మాత్రం కులాలతో నిమిత్తం లేకుండా అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. సుమారుగా సింగరకొండలో సామాజిక వర్గాల వారీగా 10 కి పైగా అన్నదాన సత్రాలు వున్నాయి. దాదాపుగా ఈ సత్రాల అన్నింటిలో 60 నుంచి 70 వేల మందిదాక పాల్గొన్ని భోజనాలు చేసినట్లు సమాచారం. ఎక్కువగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినవారిలో కాకతీయ సేవా సమితి సత్రం, వేమారెడ్డి రెడ్డి సేవా సత్రం, ముందు వరుసలో వున్నట్లు నిర్వహకులు వెల్లడించిన సమాచారాన్ని బట్టి తెలుస్తుంది. ఏది ఏమైనా సింగరకొండ తిరునాళ్ళలో భక్తులకు అన్నప్రసాదానికి, త్రాగునీటికి, మజ్జిగ, ఆల్పాహారం వంటి వాటిని సత్రాల వారితోపాటు పలు సేవా సంస్థలు, కూడ తమకు తోచినవిధంగా అందించారు.

## పులి వెంకటరెడ్డి పార్కు - పచ్చదనం కోల్పోయిన ప్రజా ఆవరణ

### - పచ్చని పార్కుకు పాత జ్ఞాపకాలే - కనిగిరిలో పులి వెంకటరెడ్డి పార్కు దయనీయ స్థితి









**కనిగిరి మార్చి 3, ప్రభాతవార్త**

పట్టణ ప్రజలకు ప్రశాంతత, ఆహ్లాదం, ఆరోగ్యాన్ని పంచే కేంద్రంగా నిలవాల్సిన పులి వెంకటరెడ్డి పార్కు ప్రస్తుతం నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. ఒకప్పుడు పచ్చని మొక్కలు, రంగు రంగుల పూలతో హరివిల్లు సోయగాన్ని తలపించిన ఈ పార్కు ఇప్పుడు ఎండిన కొమ్మలు, కలుపు మొక్కలతో కళా విహీనంగా కనిపిస్తోంది. చెట్ల పాదాలు ఖాళీగా ఉండటం, పచ్చదనం తగ్గిపోవడం సందర్శకులను నిరాశకు గురి చేస్తోంది. గతంలో సాయంత్రం వేళల్లో కనులవిందు చేసిన వాటర్ ఫాల్ లైటింగ్ గత పదేళ్లుగా మూడబోయింది. మోటార్లు చెడిపోవడంతో నీటి జలపాతం నిలిచిపోయి ఒకప్పుడు సందడి చేసిన ప్రదేశం నిశ్శబ్దంగా మారింది. పార్కు అందాన్ని రెట్టింపు చేసిన ఆ దృశ్యం ఇప్పుడు జ్ఞాపకాల్లో మాత్రమే మిగిలిపోయింది. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉయాలలు కనిపించవు. జారుడు బల్లలు, దూకుడు బల్లలు మరమ్మత్తులకు గురై వినియోగానికి అనర్హంగా మారాయి. ఆటల సందడి తో కళకళలాడాల్సిన ప్రాంగణం నిశ్శబ్దంగా మారి, చిన్నారులు నిరాశతో వెనుదిరిగే పరిస్థితి నెలకొంది. ఉదయం వేళల్లో ఆరోగ్య సాధన కోసం వచ్చే ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు కూడా సక్రమ నిర్వహణ లేక మొరాయిస్తున్నాయి. గ్రీజింగ్ చేయకపోవడంతో బేరింగ్లు చెడిపోవడం వల్ల పరికరాలు సరిగా పని చేయడంలేదు. వృద్ధులు, యువత వ్యాయామానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన వేదిక అసౌకర్యానికి దారి తీస్తోంది. ఇక పార్కులో ఒకప్పుడు సందర్శకులకు జ్ఞాన వేదికగా నిలిచిన రీడింగ్ రూమ్ ప్రస్తుతం మూతపడింది. ఉదయం, సాయంత్రం ప్రముఖ దినపత్రికలు అందుబాటులో ఉండేవి. సాయంత్రం వేళల్లోటీవీల ద్వారా సినిమాలు, వినోద కార్యక్రమాలు ప్రదర్శించేవారు. ఇప్పుడు ఆ సదుపాయాలు నిలిచిపోవడంతో పార్కులో సాంస్కృతిక వాతావరణం కనిపించడం లేదు. పట్టణ ప్రజలకు విశ్రాంతి, వినోదం, ఆరోగ్యం కలిపిన సమగ్ర వేదికగా ఉండాల్సిన ఈ పార్కును మున్సిపాలిటీ మరింత శ్రద్ధతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పచ్చదనం పునరుద్ధరణ, వాటర్ ఫాల్ మరమ్మత్తులు, చిన్నారుల ఆట పరికరాల పునఃస్థాపన, ఓపెన్ జిమ్ నిర్వహణ, రీడింగ్ రూమ్ పునఃప్రారంభం వంటి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఇప్పటికైనా స్పందిస్తారా..? :**

కనిగిరి పట్టణానికి ఆహ్లాదాన్ని పంచే ఏకైక ప్రధాన పార్కు మళ్లీ పూర్వవైభవంతో కళకళలాడేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని ప్రజలు ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు.

**వినోద వేదికకు విరామం.. నిర్లక్ష్యమే కారణమా..? :**

పులి వెంకటరెడ్డి పార్కు నిర్వహణ సక్రమంగా లేకపోవడం అధికారుల.. పాలకవర్గం చెబుతున్న పట్టించుకోకపోవడం మరొక కారణంగా కనిపిస్తుంది. కనిగిరి మున్సిపాలిటీలో పన్నుల రూపంలో కోట్లల్లో ఆదాయం వస్తున్న ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కులో నిర్వహణ లోపంతో పచ్చదనం కరువై ఆట వస్తువులు రిపేరై వ్యాయామ వస్తువులు పనిచేయక కళావిహీనంగా ఉంది. అయితే మున్సిపాలిటీ అభివృద్ధి చేయాలనుకుంటే అది సర్వసాధారణమే కానీ మున్సిపాలిటీ చేయలేని పక్షంలో దాతలకు పిలుపు ఇస్తే దాతలు ముందుకు వచ్చి పార్కును అభివృద్ధి చేస్తారని ప్రజలు ఆ దిశగా ఆలోచన చేయాలని ఒక వేళ మున్సిపాలిటీకి పార్కు ఆర్థిక భారంగా మారితే దాతలైన తీసుకొని పార్కును పచ్చదనంగా అభివృద్ధి చేసి కనిగిరి పట్టణ ప్రజలకు చిన్నారులకు సౌకర్యాలు కల్పించాలని ఆహ్లాదానికి సౌకర్యాలు కలిగించాలని కోరుతున్నారు.









## జనసంద్రంగా మారిన సింగరకొండ తిరునాళ్ళ

### - అధికారుల సమన్వయంతో విజయవంతం - శభాష్ అధికార యంత్రాంగం



**అద్దంకి, మార్చి 3,ప్రభాతవార్త**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహాస్వామి, శ్రీ ప్రసన్నాంజనేయస్వామిల 71వ వార్షిక తిరునాళ్ళ విజయవంతంగా నిర్వహించినందుకు అధికార యంత్రాంగాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ, ప్రమాద సంఘటనలు చోటు చేసుకోకుండా, కట్టు దిట్టమైన రోడ్డు భద్రత, ట్రాఫిక్, ప్రజా సౌకర్యాలు, కల్పించడం లాంటి చర్యలతో తిరునాళ్ళ విజయవంతంగా జరిగింది. ఇటీవల కాలంలో తిరునాళ్ళ జాతరకు ప్రజలనుంచే ఈ స్థాయిలో స్పందన చూడలేదని, పలువురు అభిప్రాయ పడ్డారు. ఆలయ అధికారులు, పాలకమండళ్ళు, ప్రభుత్వ యంత్రాంగం సమిష్టికృషి, సమన్వయంతో ఇది సాధమైయిందని, అటు ఆలయ అధికారులు, ఇటు పోలీస్, రెవిన్యూ అధికారులు, అభిప్రాయ పడ్డారు. సుమారు 3లక్షల వరకు భక్తులు తిరునాళ్ళకు వచ్చివుంటారని అంచనా. ఉదయం నుండే ఆలయాన్ని సందర్శించే భక్తులు గంట,గంటకు భక్తుల రాక పెరిగింది. ప్రసన్నాంజనేయస్వామి ఆలయ నిర్వహాకులు, అధికారులు, భక్తులను క్యూ లైన్లద్వారా దైవదర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇది ఇలా వుండగా, స్వామి వారిని దర్శించుకున్న ప్రతిభక్తునికి తిరుపతి తరహా లడ్డును తయారు చేసి భక్తులకు ఒక్కొక్కటి చొప్పున అందజేశారు. మధ్యాహ్నం 3గంటల వరకు 30వేల లడ్డులను భక్తులకు అందజేసినట్లు ఆలయ ఈఓ తిమ్మానాయుడు వెల్లడించారు. ఆ తరువాత స్వామి వారిని దర్శించుకున్నవారికి లడ్డులు అందజేయలేక పోయినట్లు, తయారు చేయడంలోతగినంత సిబ్బంది లేకపోవడం వలన భక్తులకు సాయంత్రం నుండి దర్శించుకున్నవారికి లడ్డు ప్రసాదం, లభించలేదని వివరించారు. సుమారు ఉదయం నుండి ఆలయాన్ని మూసివేసే వరకు భక్తులు 75 వేలమంది దాక దర్శించుకొని వుంటారని అంచనా. తిరునాళ్ళ జనసంద్రంగా మారడానికి 9విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేయడం ఒక కారణంగా భక్తులు అభిప్రాయ పడ్డారు.

**శభాష్ పోలీస్ :**

సింగరకొండ తిరునాళ్ళకు మూడు ఉమ్మడి జిల్లాలనుండి అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చిన నేపద్యంలో ఏఒక్క భక్తునికి అసౌకర్యం లేకుండా, రాకపోకలలో ఇబ్బంది తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్య చోటు చేసుకోకుండా, పోలీస్ యంత్రాంగం విశేషకృషిచేసింది. జిల్లా ఎస్‌పి ఆదేశాలతో దర్శి డిఎస్‌పి పర్యవేక్షణలో, అద్దంకి పట్టణ సి.ఐ. సుబ్బరాజు ఆధ్వర్యంలో ఇటు మేదరమెట్ల నుండి, రేణింగవరం, సంతమాగులూరు వైపు, బల్లికురవవైపు, రహదారులలో పెద్ద ఎత్తున పోలీస్ యంత్రాంగం, సోమవారం ఉదయం నుండి మంగళవారం ఉదయం వరకు 650కిపైగా సిబ్బంది విధులు నిర్వహించారు. దీనితో ఎక్కడా ఎటువంటి చిన్న సంఘటన కూడ చోటు చేసుకోకపోవడం పట్ల పోలీస్ యాంత్రాగాన్ని పలువురు అభినందిస్తున్నారు. జిల్లా ఎస్‌పి, జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు తిరునాళ్ళ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. దీనితోపాటు రాష్ట్ర విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ తిరునాళ్ళ ఉత్సవాన్ని ప్రారంభించినరోజే అధికార యంత్రాగానికి తిరునాళ్ళ నిర్వహణపై పలు సూచనలు చేశారు. దీనితో అధికార యంత్రాగం సమిష్టిగా కృషిచేసి తిరునాళ్ళను విజయవంతం చేశారు.

## మోసపూరిత కూటమి ప్రభుత్వాన్ని దింపాలి - మాజీ ఎమ్మెల్యే అన్నా



**కొనకనమిట్ల, మార్చి 3, ప్రభాతవార్త**

మోసపూరిత కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని వైకాపా మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కోరారు. సోమవారం రాత్రి మునగపాడు చౌడమ్మ తిరునాళ్లలో వైకాపా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాలు అమల్లో పూర్తిగా విఫలమైందని, అప్పులె తెచ్చిన నిధులు రాజధాని అమరావతికే ఖర్చు చేస్తున్నారే తప్ప సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కార్యకర్తలకు, నాయకులకు చౌడమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. కంభం మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టిస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు పాలనలో ఇసుక దోపిడి, ఊరురా మద్యం బెల్టు షాపులు ద్వారా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేశారని, ఫీజు రియింబర్స్‌మెంట్ సకాలంలో ఇవ్వటం లేదని కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మూరబోయిన మురళీకృష్ణ, మండల కన్వీనర్ ఎం.శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, నాయకులు కామసాని వెంకటేశ్వరరెడ్డి, గర్రె శ్రీనివాసులు, చిరుగూరి కోటేశ్వరరావు, చంద్రశేఖర్, సర్పంచ్ సిద్దాభినబి, పాలూరి వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

